ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



బాపట్ల జిల్లా వార్తలు

5


మంగళవారం 30 సెప్టెంబరు 2025




● అరవింద వారధిని తాకుతూ వరద ప్రవాహం

# కమీషన్‌కు.. లోను కావాల్సిందే!

- డ్వాక్రా మహిళలపై ఆర్పీ, యానిమేటర్ల దోపిడీ!
- రుణం పొందాలంటే మామూళ్లు ఇచ్చుకోవాల్సిందే
- ఒక్కో గ్రూపు నుంచి రూ. 10వేల నుంచి 15వేలు వసూలు
- పొదుపు రుణాల్లోనూ వాటాకు డిమాండ్



రుణాలు మంజూరు కావాలంటే.. ముందుగానే కమీషన్‌కు లోను కావాల్సిందేనని పొందుపు సంఘాల మహిళలపై ఆర్పీలు, యాని మేటర్లు బెదిరింపులకు పాల్పడుతున్నారు. డ్వాక్రా గ్రూపులకు బ్యాం కులు.. రుణ చెల్లింపులు బాగా ఉండి, రుణం ఇచ్చేందుకు ముందుకు వచ్చినా సరే వాటికి మోకా లడ్డు తున్నారు. ముందుగా కమీషన్ చెల్లిస్తేనే రుణానికి దరఖాస్తు పెడతా మని తెగేసి చెబుతున్నారు. ఇలా డ్వాక్రా మహి ళలపై యానిమేటర్లు, రిసోర్స్ పర్సన్ (ఆర్పీ)ల దోపిడీ నిత్యకృత్యంగా మారి పోయింది. కానీ, వారిపై ఫిర్యాదు చేసేం దుకు పొదుపు మహిళలు ముందుకు రావడం లేదు. ఒక వేళ వచ్చినా తగిన చర్యలుంటాయన్న ఆశా వారికి లేదు.

> ప్రత్తిపాడు మండలంలో డ్వాక్రా గ్రూపులకు రుణాలు మంజూరు కావాలంటే.. తమకు కమీషన్లు ఇవ్వాల్సిందేనంటూ యానిమేటర్లు పట్టుబట్టిన విషయం తాజాగా వెలుగు చూసింది. యానిమేటర్ మొదలు ఏపీఎం వరకూ చేతులు తడిపితేనే రుణాలు వస్తాయంటూ బెదిరింపులు శృతిమించడంతో వివాదం రచ్చకెక్కింది.



గుంటూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా గ్రూపుల మహిళలను మామూళ్ల గద్దలు వేదించుకు తింటున్నాయి. డ్వాక్రా సంఘాల్లో ఏ చిన్న పని జరగాలన్నా చేయి తడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్వావలంబన కోసం ఇచ్చే రుణాలు మొదలు అత్యవసర పరిస్థితుల్లో తాము దాచుకున్న పొదుపు డబ్బులపై తీసుకునే రుణాలకు కూడా గ్రూపు సభ్యులైన మహిళలు భారీ మొత్తంలో కమీషన్ చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పరి స్థితిపై మహిళలు గగ్గోలు పెడుతున్నా.. ఏమాత్రం వెరవకుండా పట్టణాల్లోని మెప్మా రిసోర్స్ పర్సన్లు, గ్రామాల్లోని సెర్ప్ యాని మేటర్లు అందినకాడికి మహిళలను దోచేస్తున్నారు.

**● రాబందుల్లా ఆర్పీ, యానిమేటర్లు**

ఉమ్మడి జిల్లాలో గ్రామీణాభివృద్ధి (మిగతా 6వ పేజీలో)



● పెనుమూడిపల్లెపాలెం వాసులను పడవల ద్వారా పునరావాస కేంద్రాలకు తరలింపు

# జల దిగ్బంధంలో లంకలు



పోతార్లంక నుంచి ట్రాక్టర్‌పై ఒడ్డుకు వస్తున్న యువకులు



దోనేపూడి వద్ద వరద నీటిలో పసుపు

- రోడ్లపైకి నీరు చేరటంతో దారులు మూత
- ఇళ్లలోకి వరద నీరు... లోతట్టు గ్రామాల నుంచి సురక్షిత ప్రాంతాలకు
- పెనుమూడిలో నదివైపు ఇళ్లలోకి నీరు
- కొనసాగుతున్న రెండో ప్రమాద హెచ్చరిక

కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ కృష్ణా పరివా హక ప్రాంత లంక గ్రామాలను చుట్టుముడు తోంది. రోడ్లపై ప్రవహిస్తుండటంతో రాక పోకలకు వీలులేకుండా దారులు మూసుకు పోతున్నాయి. మరోపక్క లోతట్టు గ్రామా ల్లోని ఇళ్లలోకి క్రమంగా నీరు చొచ్చుకొ స్తోంది. దీంతో ఆయా గ్రామాల నుంచి జనాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించే ప్రయత్నాల్లో అధికారులు నిమగ్నమ య్యారు. ఇటు గుంటూరు జిల్లా, అటు బాపట్ల జిల్లాల పరిధిలో అరటి, కంద, పసుపు, తమలపాకు, బొప్పాయి వంటి వాణిజ్య పంటలు నీట మునిగాయి. పిలకతో టలు పూర్తిగా నీటిలో మునిగిపోతే, గెలలు వేసిన చెట్లు కూడా కనిపించకుండా ఆకులు చివర్ల మాత్రమే వరద నీటిలో తేలి యాడుతూ కనిపిస్తున్నాయి.

- వివరాలు 8లో

## ముంచెత్తుతున్న కృష్ణమ్మ



రేపల్లె: మోర్తోట ఆలయం చుట్టూ చేరిన వరదనీరు



ఆవులవారిపాలెం రహదారిపై వరద నీరు



తిప్పలకట్ట వద్ద వరద ప్రవాహంతో పొలాలకు కోత

# పరిశీలించిన అర్జీలకు వెంటనే పరిష్కారం

- ప్రతి శుక్రవారం 22ఏ భూ సమస్యలపై సమీక్ష
- కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్



అర్జీ దారులతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

బాపట్ల, సెప్టెంబరు 29(ఆంధ్ర జ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందజేసిన అర్జీలను అధి కారులు పరిశీలించిన వెంటనే పరి ష్కరించాలని కలెక్టర్ డాక్టర్ వి.వినో ద్‌కుమార్ అధికారులను ఆదేశించా రు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వ హించిన పీజీఆర్‌ఎస్‌లో జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలు తమ స మస్యలను అర్జీల ద్వారా కలెక్టర్‌కు వివరించా రు. అర్జీలను ఆయా శాఖల అధికారులకు కలె క్టర్ అందజేశారు. అనం తరం నిర్వహించిన స మావేశంలో పింఛన్లను 1వ తేదీనే వంద శా తం పంపిణీ చేయాలని అధికారులకు కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి నెలా 28న ఉదయం 10.30 గంటలకు పెన్షన్లు, నిత్యావసరాల పంపిణీపై సమావేశం నిర్వహించడం జరుగు తుందన్నారు. ఈ లోపే.. అంగన్‌వాడీ కేంద్రాల కు రేషన్ షాపుల ద్వారా బియ్యంతో పాటు మి గిలిన వస్తువులు పంపిణీ చే సే విధంగా చూడాలని డీఎస్ వోను కలెక్టర్ ఆదేశించారు. ని యోజకవర్గాల్లో స్థానిక ఎమ్మె ల్యేల ద్వారా పింఛన్లు పంపిణీ చేయించే విధంగా.. ప్రత్యేకాధి కారులు చర్యలు తీసుకోవా లన్నారు. రెవెన్యూ, నిషేధిత జాబితా 22ఏ భూముల సమస్యలను జేసీ, డీఆర్వో, ఏడీ సర్వే, భూ రికార్డ్స్, సబ్ రిజి స్ట్రార్, ఆర్డీవో, తహసీల్దార్లతో కలిసి ప్రతి శుక్రవారం సా యంత్రం 3 గంటలు నుంచి 5 గంటల వరకు పరిష్కరిస్తానన్నారు. పీజీఆర్‌ఎస్‌లో వచ్చిన ని షేధిత జాబితాను ముందుగా పరిశీలించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# వెంపరాలను వెంటాడుతున్న విషజ్వరాలు

**మంచం పట్టిన 200 మంది గ్రామస్థులు**

అద్దంకి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విష జ్వరాలు వెంపరాల గ్రామ ప్రజలను పట్టి పీడి స్తున్నాయి. నెల రోజులుగా విష జ్వరాలతో పాటు కీళ్ల నొప్పులతో పలువురు మంచం పట్టా రు. దీంతో కొంత మంది స్థానిక ఆర్‌ఎంపీల వద్ద చికిత్స పొందుతుండగా.. అద్దంకిలోని ప్రవేట్ వైద్యశాలకు అధికంగా పరుగులు తీస్తు న్నారు. ప్రస్తుతం వెంపరాలలో జ్వర బాధితుల సంఖ్య 200 మందికిపైగానే ఉంది. గ్రామంలో పారిశుధ్యంపై దృష్టి పెట్టలేదని గ్రామస్థులు అం టున్నారు. మంచినీటి పైప్ లైన్లు సైడ్ డ్రెయిన్ల లో ఉండటంతో లీకులు ఉన్న చోట మురుగు నీరు కలుస్తుందన్న అను మానం వ్యక్తం చేస్తు న్నారు. విషజ్వరాలు విజృంభించినా వైద్య శిబి రాలు ఏర్పాటు చేయకపో వడంతో.. ప్రైవేటు వైద్యు లను ఆశ్రయించి రూ.వేల కు వేలు వైద్య ఖర్చులకు అవుతున్నాయని ఆందోళ న చెందుతున్నారు. ఉన్న తాధికారులు స్పందించి గ్రామంలో వెద్య శిబిరం ఏర్పాటు చేయాలని గ్రా మస్థులు కోరుతున్నారు.



చికిత్స పొందుతున్న సుబ్బారావు



కొమ్మినేనివారిపాలెంలో రైతుకు ట్రాన్స్‌ఫార్మర్లు అందిస్తున్న ఈఈ మస్తాన్‌రావు

# సకాలంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు

- ఈఈ నల్లూరి మస్తాన్‌రావు
- 160 మంది రైతులకు.. 32 ట్రాన్స్‌ఫార్మర్ల పంపిణీ

బల్లికురవ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): రైతులకు వ్యవసాయ విద్యుత్ సమస్య లేకుండా ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నామని అద్దంకి డివిజన్ విద్యుత్ శాఖ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కొమ్మినేనివారి పాలెం సబ్ స్టేషన్‌లో బల్లికురవ మండలం లోని పలు గ్రామాలకు చెందిన 160 మంది రైతులకు 32 వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫా ర్మర్లను ఈఈ అందజేశారు. ఈ సందర్భం గా జరిగిన సభలో అయన మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా లేని విధంగా బల్లికురవ మండలానికి ఏడాదిలో రూ.8 కోట్ల విలువ చేసే 947 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేసి లైన్లను ఏర్పాటు చేశామ న్నారు. ముందుందు దరఖాస్తు చేసిన ప్రతి ఒక్కరికి సకాలంలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ చొరవతో కనెక్షన్లు మంజూరు చేస్తా మన్నారు. గ్రామాల్లో ఎళ్ల నుంచి దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను ఆర్డీఎస్ఎస్ పథకంలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. రైతులు విద్యు త్ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరా రు. గృహాలకు కూడా త్రీఫేజ్ విద్యుత్ సౌక ర్యం కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా రై తులు మంత్రి రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఈఈ సురేం ద్రబాబు, ఏఈ శ్రీనివాసరావు, కార్గిల్ చౌదరి, టీడీపీ నేతలు చింతల శ్రీనివాసరావు, ఏల్చూరి శ్రీనివాసరావు, దివ్వె రాధ, కొమ్మినే నిబాబురావు పాల్గొన్నారు.

# డీఎస్సీ అభ్యర్థులకు 3 నుంచి శిక్షణ తరగతులు

గుంటూరు (విద్య) సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు వచ్చే నెల 3 నుంచి 10వ తేదీ వరకు శిక్షణ తరగతులు ప్రా రంభం కానున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో.. గుంటూరు, పల్నాడు, బాపట్ల ప్రాంతాల్లోని కళాశాలల్లో శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఇందు కోసం విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. జోన్-3 పరిధిలో దాదాపు 1,600 మంది వరకు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఇటీవ ల వీరికి నియామక పత్రాలను ప్రభుత్వం జారీ చేసింది. పాఠశాలల్లో వారికి పోస్టింగ్ ఇచ్చేందుకు అవసరమైన ప్రాథమిక శిక్షణ ను విద్యాశాఖ అందించనుంది.

**శిక్షణ తరగతులు ఇలా..**

డీఎస్సీ కన్వీనర్ జారీ చేసిన ఉత్తర్వు లు ప్రకారం తొలుత ప్రాథమిక శిక్షణ అంది స్తారు. విద్యాబోధనలో ప్రావీణ్యం, విద్యా శాఖ విధానాలు, కార్యక్రమాలపై అవగా హన కల్పిస్తారు. విద్యాహక్కు, బాలల హక్కులు వంటి ముఖ్యమైన చట్టాలను వివరిస్తారు. జాతీయ విద్యా విధానం, రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం అమ లు చేస్తున్న వివిధ పథకాలపై అవగాహన కల్పిస్తారు. పాఠ్యప్రణాళికల తయారీ, బోధ న పద్ధతులు, మూల్యాంకన విధానా లు, నిత్య విద్యార్థిగా ఉంటూ బోధ నను మెరు గు పరుచు కోవడం, విద్యార్థుల్లో సృజనాత్మ కతను గుర్తించడం వంటి అంశా లపై సవివరంగా శిక్షణ ఇస్తారు.



**నేటితో గడువు..**

# పొడిగిస్తేనే ఆదరువు

- 'బర్లీ' కొనుగోళ్లు కొనసాగేనా!
- నేటితో పొగాకు సేకరణకు ముగింపని గతంలో ప్రకటన
- మరో రెండు వారాల గడువు పెంచాలని అధికారుల నివేదికలు
- ఇంకా రైతుల వద్ద దాదాపు లక్ష క్వింటాళ్లు
- గోదాముల విషయంలో కొనసాగుతున్న ఇక్కట్లు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

బర్లీ పొగాకును మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది మొదలుకుని నేటి వరకు అనేక బాలారిష్టాలు ఎదురైనా వాటిని సమర్థంగా ఎదుర్కొని కొనుగోళ్ల అంకాన్ని ఓ కొలిక్కి తేగలిగారు. సెప్టెంబరు చివరితో కొనుగోలు కేంద్రాలు మూసివేస్తామని గతంలోనే మార్క్‌ఫెడ్ అధికారులు చెప్పారు. కానీ ఇంకా రైతుల వద్ద దాదాపు లక్ష క్వింటాళ్ల వరకు పొగాకు నిల్వలు ఉన్నట్లు క్షేత్రస్థాయి పరిస్థితులు చెబుతున్నా యి. ఈ నేపథ్యంలో మార్క్‌ఫెడ్ కొనుగోళ్ల ప్రక్రియ ఇంకో రెండు వారాల పాటు కొనసాగితే మరి కొంత మంది బర్లీ రైతులకు మేలు జరుగుతుందని, అందుకు (మిగతా 6వ పేజీలో)



## సరస్వతిదేవిగా బగళాముఖి

పిట్టలవానిపాలెం : చందోలులో వేంచేసియు న్న శ్రీబగళాముఖి అ మ్మవారి దేవస్థానంలో శ్రీదేవి శరన్నవరాత్రి మ హోత్సవ కార్యక్రమాలు 8వ రోజు ఘనంగా జ రుగుతున్నాయి.సోమవా రం శ్రీ బగళాముఖి అ మ్మవారు సర్వదేవి అ లంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్ర మాలను కార్యనిర్వాహ ణాధికారి జి.నరసింహ మూర్తి పర్యవేక్షించారు.

## జీఎస్టీ సంస్కరణ ఫలాలు అందరికీ చేరాలి

● 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంక దినకర్




సమావేశంలో మాట్లాడుతున్న 20 సూత్రాల అమలు కమిటి ఛైర్మన్ లంక దినకర్

బాపట్ల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణ ఫలాలు ప్రతి వినియోగదారుడు అందుకునే విధంగా అధికారులు కృషి చేయాలని 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంక దినకర్ అన్నారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ సంస్కరణలపై సోమవారం బాపట్లలో అవగాహన సదస్సు నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండమూది బంగారుబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దినకర్ మాట్లాడుతూ, జీఎస్టీ 2.0 సంస్కరణల నిర్ణయాలు సక్రమంగా అమలు చేసి ప్రధాని మోదీ సంకల్పమైన వికసిత్ భారత్ సాధనకు కృషి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. వాపారస్థులు జీఎస్టీ సంస్కరణలను వినియోగదారులకు తెలియజేయాలని చెప్పారు. జీఎస్టీ సంస్కరణలు ప్రకటించిన తర్వాత దేశంలో 90 శాతం కుటుంబాల కొనుగోలు శక్తి పెరిగిందని దినకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.గంగాధర్‌గౌడ్, వాణిజ్య పన్నులశాఖ డిప్యూటీ కమిషనర్ మురళి కృష్ణ, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాధరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఉపకులపతి నియామకం ఎప్పుడు..?

● ముందుకు సాగని వర్సిటీ అభివృద్ధి

ఏఎన్‌యూ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏఎన్‌యూకు శాశ్వత ఉపకులపతి నియా మకం లేక పోవడంతో వర్సిటీ అభివృద్ధి కుంటుపడుతోంది. కూటమి ప్రభుత్వం అధికారం లోకి రాగానే అప్పటి వీసీ రాజశేఖర్ అధికార దుర్వి నియోగం, అవి నీతి, అక్రమాలపై నిరసనలు వెల్లువెత్తి వీసీ పదవికి రాజీనామా చేయాలంటూ ఆందోళనలు ఉధృతం కావడంతో గత్యంతరం లేక రాజశేఖర్ గతేడాది జూలై ఒకటిన రాజీనామా చేశారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఆచార్య గంగాధర రావును తాత్కాలిక ఉపకులపతిగా నియమించింది. అంతేకాకుండా శాశ్వత ఉపకులపతి నియామ కం కోసం రెండుసార్లు సెర్చ్ కమిటీలను ప్రభుత్వం నియమించినప్పటికీ, నియామకం జరగలేదు. శాశ్వత ఉపకులపతి ఉంటే అన్ని అంశాలపై వేగంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుంది. తద్వారా విశ్వవిద్యాలయం అభివృద్ధి పరుగులు తీసే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం తాత్కాలిక ఉపకులపతి పాలనలో కొన్ని కీలక నిర్ణయాలకు నిబంధనలు అడ్డురావడంతో అభివృద్ధి కార్యక్రమాలపై త్వరితగతిన నిర్ణయాలు తీసుకోలేకపోతున్నట్లు తెలుస్తోంది. దీంతో విశ్వవిద్యాలయం అభివృద్ధి ముందుకు సాగటం లేదనే విమర్శలు ఉన్నాయి.

## ఎన్‌జీ రంగా వ్యవసాయ వర్సిటీ అక్రమాలపై విచారణ..!

● యూనివర్సిటీ ప్రొఫెసర్ ఫిర్యాదుతో కదలనున్న డొంక

గుంటూరు సిటీ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గుంటూరు లాం ఫాం సమీపంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన అక్రమాలపై విచారణ జరగనుంది. ఈ మేరకు వ్యవసాయశాఖకు ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది. యూనివర్సిటీలో పనిచేస్తున్న ప్రొఫెసర్ ఫిర్యాదు ఆధారంగా ఈ విచారణ జరగనున్నట్లు సమాచారం. ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అక్రమాలపై ఆగస్టు చివరి వారంలో యూనివర్సిటీ ప్రొఫెసర్ ఫిర్యాదు చేశారు. కోరం లేకుండానే ఇంచార్జి వీసీ పాలకవర్గ సమావేశాలు ఏర్పాటు చేశారన్నది ఆయన ప్రధాన ఆరోపణగా కనిపిస్తోంది. ఆరుగురు సభ్యులు ఉంటేనే పాలకవర్గ సమావేశం ఏర్పాటు చేయాలని నిబంధనలు స్పష్టం చేస్తున్నా కేవలం ఐదుగురితో మాత్రమే నడిపించి కీలక నిర్ణయాలు తీసుకున్నారని గవర్నర్ దృష్టికి తీసుకువెళ్ళారు. బదిలీలు, నిధుల కేటాయింపు, పదోన్నతుల వ్యవహారంలో కూడా భారీ అవినీతి జరిగిందని ఫిర్యాదులో పేర్కొనటంతో విచారణకు ఆదేశించినట్లు తెలుస్తోంది.

**విజిలెన్స్‌కు ఫిర్యాదులు...**

ఎన్‌జీ రంగా యూనివర్సిటీ అక్రమాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు కూడా ఫిర్యాదులు వెళ్లాయి. యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ ఏవయితే ఆరోపణలు చేశారో వాటినే ఉటంకిస్తూ విజిలెన్స్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపించి ఏసీబీ కేసు నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.



# ప్రభుత్వ పథకాల్లో మహిళలకే ప్రాధాన్యం

● ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ● దసరా, దీపావళి కానుకగా సుగాలీ మహిళలకు చీరల పంపిణీ



జీఎస్టీ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ

వినుకొండటౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల్లో మహిళలకు అధిక ప్రాధాన్యమిస్తామని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. మహిళలకు ఆస్తి హక్కు కల్పించడంతో పాటు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు ప్రవేశపెట్టిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కిందని ఆయన అన్నారు. విఠంరాజుపల్లి సమీపంలోని జీవీ గెస్ట్ హౌస్‌లో జీఎస్టీ తగ్గింపుపై మహిళలకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ, జీఎస్టీ తగ్గింపు ద్వారా ఎన్డీయే ప్రభుత్వం నిత్యావసర ధరలను సామాన్యు లకు అందుబాటులోకి తీసుకొచ్చిందని అన్నారు. చంద్రబాబు హ యాంలోని కూటమి ప్రభుత్వం పేదలకు సంవత్సరానికి మూడు సిలెండర్లు ఇవ్వడంతో పాటు డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి మహి ళలకు ఆర్థిక వెసులుబాటును కల్పిస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో ఐఏఎస్, ఐపీఎస్ చదువుకునే ఎస్టీ మహిళలకు రూ. 50వేల స్కాలర్ షిప్ అందజేస్తామని చెప్పారు. ఎస్టీ బిడ్డలు బాగా చదువుకో వాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు వారికి స్కాలర్‌షిప్‌లు అందజే స్తామని హామీ ఇచ్చారని అన్నారు. సేవాలల్ దేవాలయ నిర్మాణానికి రూ.5లక్షలు విరాళంగా ఇచ్చి కమిటీ హాల్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. శివశక్తి లీలా ఫౌండేషన్ ఆధ్వర్యంలో దసరా, దీపావళిని పురస్కరించుకొని 5 వేల మంది సుగాలీ మహిళ లకు చీరలతో పాటు గాజుల కొనుగోలుకు నగదును అందజేస్తామని జీవీ ఆంజనేయులు ప్రకటించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెమ్మసాని నాగేశ్వ రరావు, మాజీ ఎంపీపీ ఆరికట్ల వాసుదేవరెడ్డి, మేరాజోత్ హనుమా నాయక్, పెసల వెంకటనారాయణ, గుండెనాయక్, గోవిందునాయక్, కౌన్సిలర్ షకీలాతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జీఎస్టీ తగ్గింపుతో ప్రజల ఆర్థిక పరిస్థితి మెరుగు

● పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి



జీఎస్టీ తగ్గింపుపై సత్తెనపల్లిలో ప్రచారం చేస్తున్న కొమ్మాలపాటి శ్రీధర్

సత్తెనపల్లి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో ప్రజల తలసరి ఆదాయం మెరుగు పడుతుందని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. సత్తెనపల్లిలో సోమవారం కిరాణా, మెడికల్, వస్త్ర దుకాణాలను సందర్శించి పలువురు వ్యాపారస్థులు, వినియోగదారులతో జీఎస్టీ తగ్గింపుపై కొమ్మాల పాటి మాట్లాడారు. నాయకులతో కలసి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వల్ల సామాన్యులకు ఆర్థిక ప్రయోజనంతో పాటు పొదుపు పెరుగుతుందని అన్నారు. తగ్గించిన జీఎస్టీ అమలుకు వ్యాపారులు సహకరించాలని కోరారు. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన దీపం, స్త్రీ శక్తి, తల్లికి వందనం పథకాలతో ప్రజలు డబ్బులు పొదుపు చేసుకుంటున్నారని కొమ్మాలపాటి పేర్కొన్నారు. ప్రచారంలో కొమ్మాలపాటి వెంట టీడీపీ నేతలు చౌట శ్రీనివాసరావు, దరువూరి నాగేశ్వరరావు, సయ్యద్ పెద కరిముల్లా, మస్తాన్‌వలి, జవ్వాజి రామ్మోహనరావు, పోతుగంటి రామ కోటేశ్వరరావు, నూర్ బాషా జానీ బాబు, వక్కంటి అజయ్, పోట్ల ఆంజనేయులు, మార్కెట్ రాజు, రాంబో బుడే తదితరులు ఉన్నారు.

## ఏకపక్షంగా చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు

● యేల్చూరి ప్యానల్ ఘన విజయం



ఓటరు స్లిప్పులు అందజేస్తున్న యేల్చూరి, ఆతుకూరి తదితరులు

గుంటూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): తొలి నుంచి ఉత్కంఠ కలిగించిన ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా కార్యవర్గ ఎన్నికలు ఏకపక్షంగా సాగాయి. ఈ ఎన్నికల్లో యేల్చూరి ప్యానల్ సభ్యులు ఘన విజయం సాధించారు. ప్రత్యర్థిగా నిలిచిన రంగా బాలకృష్ణ ఇతర సభ్యులు ఓటమి పాలయ్యారు. చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యవర్గం గడువు ఏడాది పాటు ఉంటుంది. కార్యవర్గం పదవీ కాలం ముగిసే లోపు సర్వసభ్య సమావేశం నిర్వహించి బరిలో ఎవరూ నిలవకపోతే ఎన్నిక ఏకగ్రీ వం అయ్యేది. ప్రస్తుత అధ్యక్షుడు యేల్చూరి ప్యానెల్‌పై సుదీర్ఘకాలం చాంబర్ కార్యదర్శిగా వ్యవహరించిన రంగా బాలకృష్ణ వర్గం పోటీకి దిగింది. చాంబర్ శాశ్వత గౌరవాధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు, అధ్యక్షుడు యేల్చూరి వెంకటేశ్వర్లు నేతృత్వంలో ఎన్నికలు జరిగాయి. రహస్య బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ సాగింది. జిల్లా కేంద్రం గుంటూరుతో పాటు బాపట్ల, తెనాలి, పల్నాడు ప్రాంతాల నుంచి ప్రత్యేక వాహనాలతో జిన్నా టవర్ సెంటర్‌లోని చాంబర్ కార్యాలయానికి సభ్యులు తరలివచ్చారు. దాంతో చాంబర్ భవనం వద్ద కోలాహలం నెలకొంది. చాంబర్‌లో మొత్తం 3 వేల మంది ఉండగా 700 మంది సభ్యులు ఎన్నికలకు హాజరై ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎన్నికలు ముగిసిన తర్వాత కౌంటింగ్ నిర్వహించి యేల్చూరి ప్యానల్ ఘన విజయం సాధించినట్లు ఆతుకూరి వెల్లడించారు.

## దెబ్బతిన్న పంటలకు పరిహారం అందిస్తాం

ఎమ్మెల్యే ఆనందబాబు



మహిళల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఆనందబాబు

భట్టిప్రోలు (కొల్లూరు) సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వరద వల్ల పంటలు దెబ్బతిన్న రైతులకు పరిహారం అందించడంతో పాటు లంక గ్రామాల్లో ప్రతి కుటుంబానికి అవసరమైన సహాయం అందజేస్తామని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. సోమవారం భట్టిప్రోలు మండలంలోని పెదలంక, పెసర్లంక, చింతమోటు గ్రామాల్లో పర్యటించి వరద ముంపులో ఉన్న పంటలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వరద తగ్గే వరకు ప్రభావిత ప్రాంతాల్లో నిరంతరం పర్యవేక్షణ చేస్తానని చెప్పారు. దెబ్బతిన్న రైతులకు తగిన పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. ముంపు ప్రభావిత ప్రాంతాల్లో తాగునీరు, వైద్యసేవలు, ఆహార సరఫరాతో పాటు అత్యవసర సేవలు నిరంతరం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించినట్లు ఎమ్మెల్యే చెప్పారు. పర్యటనలో ఎమ్మెల్యే వెంట ఏఎంసీ ఛైర్ పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ మోటూరి పుణ్యశ్రీనివాసరావు, వేములపల్లి జగన్నాథరావు, కాట్రగడ్డ నాగమల్లేశ్వరరావు, తహసీల్దార్ శ్రీనివాసరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కమీషన్‌కు లోనుకావాల్సిందే..!

(5వ పేజీ తరువాయి)

శాఖ పరిధిలో 74,640 స్వయం సహాయక బృందాలు (డ్వాక్రా గ్రూపులు) ఉన్నాయి. వాటిలో ఏడున్నర లక్షల మందికి పైగా మహిళలు సభ్యులుగా ఉన్నారు. గ్రూపు నిర్వహణ, సభ్యుల సమావేశం, కార్యకలాపాల్లో సహాయ సహకారాలు అందించేందుకు పట్టణ ప్రాంతాల్లో రిసోర్స్ పర్సన్లను మెప్మా నియమించగా, గ్రామీణ ప్రాంతాల్లో యానిమేటర్లను గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని సెర్ప్ నియమించింది. ఇలా గ్రూపు మహిళలకు సహాయ, సహకారాలు అందించడం కోసం ఏర్పాటు చేసిన వ్యవస్థ ఇప్పుడు రాబందుల వ్యవస్థగా మారిపోయింది. గ్రూపు మహిళలను పీడించుకుతింటున్నారు. డ్వాక్రా మహిళలు తమకు కమీషన్ చెల్లించడం అనేది హక్కుగా చెబుతూ వారిపై తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు తెస్తున్నారు. ఒక్కో పనికి రేటు కట్టి మామూళ్ల వసూళ్ల చేస్తున్నారు.

**● రుణం పొందాలంటే రూ. 10వేలు ఇవ్వాల్సిందే!**

డ్వాక్రా గ్రూపుల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రుణ సహాయం చేస్తుంది. ఏదో ఒక స్వయం ఉపాధి పొందుతూ.. మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేందుకు ఆ రుణాలు తోడ్పడుతాయి. రుణం తీరిన వెంటనే మరోమారు రుణాలు అందిస్తుంది. నిరంతరం జరిగే ఈ ప్రక్రియను యానిమేటర్లు, ఆర్పీలు ఆదాయ వనరుగా మార్చుకున్నారు. డ్వాక్రా సంఘాలకు ఇచ్చే రుణాలు బ్యాంకుల నుంచి సభ్యుల ఖాతాల్లో జమ కావాలంటే యానిమేటర్ లేదా ఆర్పీ తీర్మానం రాసి, సీసీ, ఏపీఎం సంతకాలు చేయించి అప్రూవల్ చేయించాలి. ఇదే వారికి వరంగా మారింది. దీనిని అడ్డం పెట్టుకుని ప్రతిసారి ఇలా రుణం పొందే సమయంలో ఒక్కో మహిళ నుంచి రూ.వెయ్యి, రూ.1,500 వరకూ, లేదంటే గ్రూపు మొత్తంగా రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకూ ఆర్పీలు, యానిమేటర్లు వసూలు చేస్తున్నారు. పొందుపు మహిళలు ఇవ్వడానికి ఇష్టపడకపోతే తీర్మానాలు రాయకుండా ఆపుతున్నారు. అధికారులకు ఫిర్యాదులు చేసినా వెరవని స్థితికి వారు చేరారు. మహిళలు ఫిర్యాదులు చేయకుండా బెదిరింపులకు దిగుతున్నారు. వీటితోపాటు అత్యవసర సమయంలో పొదుపు డబ్బులపై తీసుకునే రుణాలకు కూడా వీరి మామూళ్ల బాదుడు తప్పడం లేదు. గ్రూపునకు రూ.2వేల నుంచి రూ.4వేలు ఇవ్వకుండా పని మాత్రం జరగడం లేదు. వీటితోపాటు ప్రతి నెలా నిర్వహించే గ్రూపు సమావేశంలో సమావేశంలోని అంశాలు, తీర్మానాలు రాసినందుకు రూ.500 నుంచి వెయ్యి రూపాయలు వసూలు చేస్తున్నారు. దీంతో డ్వాక్రా మహిళలు లబోదిబో మంటున్నారు. అధికారులు దీనిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

## నేటితో గడువు.. పొడిగిస్తేనే.. ఆదరువు

(5వ పేజీ తరువాయి)

అనుమతివ్వాలనే అభ్యర్థనను రాష్ట్రస్థాయి అధికారులకు పంపినట్లు మార్క్‌ఫెడ్ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం తొలుత ఇచ్చిన గడువు మంగళవారంతో ముగుస్తుండగా, కేంద్రాల కొనసాగింపుపై ప్రభుత్వ నిర్ణయం ఏ విధంగా ఉంటుందోననే ఆందోళన బర్లీ రైతుల్లో ఉంది

**మూడు నెలల పాటు...**

జూన్ చివరి వారంలో మార్క్‌ఫెడ్ ద్వారా బర్లీ పొగాకు కొనుగోళ్ల ప్రారంభమయ్యాయి. బాపట్ల జిల్లాతో పాటు ప్రకాశం, పల్నాడు, గుంటూరు జిల్లాల్లోని బర్లీ పొగాకు రైతులకు మేలు జరిగేలా తొలుత 7 కేంద్రాలతో ప్రారంభించి మొత్తం 58 కేంద్రాలలో మార్క్‌ఫెడ్ కొనుగోళ్లు చేపట్టింది. గోదాములను గుర్తించిన చోటే కొనుగోళ్ల కేంద్రాలను తెరిచి రైతులు తమ నిల్వలను అక్కడకే తెచ్చేలా షెడ్యూలింగ్ ఇచ్చింది. మార్కెటింగ్, వేర్‌హౌసింగ్‌తో పాటు ఎఫ్‌సీఐ గోదాములను సైతం బర్లీ నిల్వలకోసం మార్క్‌ఫెడ్ ఉపయోగించింది. గోడౌన్‌ల కొరత కారణంగా కొనుగోళ్ల ప్రక్రియు ఎటువంటి విఘాతం కలగకూడదని ముందస్తుగానే చర్యలు తీసుకుని మూడు నెలల పాటు ఈ అంకాన్ని మార్క్‌ఫెడ్ ముందుకు తీసుకెళ్లగలిగింది. ప్రస్తుతం 6 కేంద్రాలలో కొనుగోళ్ల జరుగుతుండగా మంగళవారంతో ప్రక్రియ ముగుస్తుందా లేదా కొనసాగింపుకు ప్రభుత్వం అనుమతిస్తుందా అనేది తేలాల్సి ఉంది

**లక్షల క్వింటాళ్లలోనే మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసినా...**

ఇప్పటి వరకు నాలుగు జిల్లాల పరిధిలో 2,08,510 కింటాళ్ల బర్లీ పొగాకును మార్క్‌ఫెడ్ రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసింది. ఇందులో ఒక్క బాపట్ల జిల్లా వాటానే 1,40,298 క్వింటాళ్లుగా ఉండగా, గుంటూరు జిల్లాలో 32,064, పల్నాడులో 23,693, ప్రకాశం జిల్లాలో 12,455 క్వింటాళ్లను మార్క్‌ఫెడ్ సేకరించింది. మొత్తం 11,462 మంది రైతులకు లబ్ధి చేకూరింది. ఇప్పటికే దశల వారీగా రైతుల ఖాతాల్లో రూ.90కోట్లు జమ చేసిన మార్క్‌ఫెడ్ ఇంకా దాదాపు రూ.50 కోట్ల వరకు చెల్లించాల్సి ఉందని చెబుతోంది. ఇంత పెద్ద ఎత్తునా మార్క్‌ఫెడ్ కొనుగోళ్ళు జరిపినప్పటికీ ఇంకా అన్నదాతల వద్ద లక్ష క్వింటాళ్ల వరకు బర్లీ నిల్వలు ఉన్నట్లు తెలుస్తోంది

## ఏఎన్‌యూ ఫార్మసీ పరీక్ష ఫలితాల విడుదల

ఏఎన్‌యూ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ ఏడాది నిర్వహించిన ఫార్మసీ రీవాల్యుయేషన్ 1 నుంచి 7వ సెమిస్టర్ పరీక్ష ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఈ సందర్భంగా పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాద్ మాట్లాడుతూ ఈ ఏడాది విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెరిగిందని తెలిపారు. అలాగే బీ-టెక్ రెగ్యులర్ రెండో ఏడాది 4వ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను కూడా విడుదల చేసినట్లు చెప్పారు. పరీక్ష ఫలితాలు ఏఎన్‌యూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

## రైలు కిందపడి ప్రేమ జంట ఆత్మహత్య

● మృతులు బీటెక్ విద్యార్థులు



శ్రీనివాసరావు, లక్ష్మీ ప్రియాంక(ఫైల్)

మేడికొండూరు సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మేడికొండూరు మండలం పేరేచర్ల -ఫిరంగిపురం స్టేషన్ల మధ్య ప్రేమ జంట ఆత్మహత్య చేసుకుంది. పల్నాడు జిల్లా ముప్పాళ్ళ మండలం దమ్మాలపాడు గ్రామానికి చెందిన కోడె శ్రీనివాసరావు (20), కొల్లిపర మండలం అత్తోట గ్రామానికి చెందిన బి.లక్ష్మీ ప్రియాంక పేరేచర్ల సమీపంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నారు. కొంతకాలంగా వీరిద్దరూ ప్రేమించుకుంటున్నారు. ఈ విషయం ఇంట్లో చెప్పి పెళ్లి చేసుకుందామని ప్రయత్నించారు. ఇందుకు శ్రీనివాసరావు తల్లిదండ్రులు అంగీకరించకపోవడంతో వీరిద్దరూ గుంటూరు పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 5న ఫిర్యాదు చేశారు. తామిద్దరం ప్రేమించుకుని పెళ్లి చేసుకున్నామని పెద్దలు అంగీకరించడం లేదని చెప్పారు. దీంతో పట్టాభిపురం పోలీసులు ఇరువురి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. అనంతరం వీరిద్దరూ పేరేచర్లకు చేరుకొని కళాశాలకు వెళ్లడం ప్రారంభించారు. లక్ష్మీ ప్రియాంక హాస్టల్‌లో ఉంటుండగా, శ్రీనివాసరావు తన స్నేహితులతో కలిసి గదిలో ఉంటున్నాడు. అయితే శ్రీనివాసరావు తల్లిదం డ్రులు పెళ్లికి అంగీకరించేది లేదని తేల్చిచెబుతూ మాట్లాడటం మానేశారు. దాంతో తీవ్ర మనస్తాపానికి గురైన శ్రీనివాసరావు ఈ నెల 27న రాత్రి పేరేచర్ల-ఫిరంగిపురం రైల్వేస్టేషన్ల మధ్య ట్రైన్ కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న లక్ష్మీ ప్రియాంక 28వ తేదీన ఉదయం అదే ప్రాంతానికి చేరుకొని రైలు పట్టాలపై పడుకొని ఆత్మహత్యకు పాల్పడింది. వీరిద్దరి మృతదేహాలను నరసరావుపేట రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. వీరి మరణంతో కళాశాలతో పాటు వారి వారి గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. వారి తలిదండ్రులు బోరున విలపించారు.

## రెండు బైక్‌లు ఢీ : ఇద్దరి మృతి

తాడికొండ సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నిడుముక్కలలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందారు. అమరావతి మండలం కర్లపూడి గ్రామానికి చెందిన కుంభ శ్రీనివాసరావు (26) తన వ్యక్తిగత పనుల నిమిత్తం గుంటూరుకు వెళ్లి తిరిగి తన స్వగ్రామానికి బైక్ పై బయలుదేరాడు. తాడేపల్లికి చెందిన మరో వ్యక్తి నిడుముక్కలలో ఉన్న తన సోదరితో కలిసి గుంటూరుకు బయలుదేరాడు. ఈ క్రమంలో నిడుముక్కలలోని కళాజ్యోతి సమీపంలోకి రాగానే ఎదురెదురుగా వస్తున్న వీరి బైకులు బలంగా ఢీకొన్నాయి. దీంతో ఇరువురు వ్యక్తులకు తీవ్రగా యాలయ్యాయి. చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా మార్గ మధ్యలో శ్రీనివాసరావు మృతి చెందాడు. తాడేపల్లికి చెందిన వ్యక్తి చికిత్స పొం దుతూ సోమవారం మృతి చెందాడు. మృతుని పూర్తి వివరాలు తెలియరాలేదు. తాడికొండ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఈతకు దిగి ఇద్దరు విద్యార్థుల గల్లంతు



షేక్ హర్షద్(ఫైల్)



మార్క్‌రూఫస్(ఫైల్)

నకరికల్లు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నకరికల్లు మండలం గుండ్లపల్లి గ్రామ సమీపంలో సాగర్ కుడి కాలువలో ఈత కొట్టేందుకు దిగి ఇద్దరు విద్యార్థులు గల్లంతయ్యారు. చిలకలూరిపేటకు చెందిన హర్షద్, బాపట్ల జిల్లా ఈపూరిపాలెం గ్రామానికి చెందిన దారబడి మార్క్ రూఫస్ దసరా సెలవులు కావడంతో వారి స్నేహితుడైన షేక్ సమీర్ వలి ఉండే గుండ్లపల్లి గ్రామానికి వచ్చారు. వీరు గుం టూరులోని లాం ఫాం వద్ద గల ఒక కళాశాలలో ఇంటర్మీ డియట్ బైపీసీ చదువుతున్నారు. గుండ్లపల్లికి వచ్చిన వీరు గ్రామానికి సమీపాన గల సాగర్ కుడికాలువలో ఈత కొట్టేం దుకు వెళ్లారు. ఈ క్రమంలో మార్క్ రూఫస్ (17), షేక్ హర్షద్ (17) కాలువలో దిగి గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న నకరికల్లు ఎస్సై సతీష్ ఘటనా స్థలం వద్దకు చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు.

## శబరి ఎక్స్‌ప్రెస్.. ఇకపై సూపర్ ఫాస్ట్.!

● నేటి నుంచి మారనున్న రైలు నంబర్లు ● 2 గంటల ప్రయాణ సమయం ఆదా ● ప్రయాణికులపై సూపర్ ఫాస్ట్ చార్జీల భారం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్-త్రివేంద్రం మధ్య నడుస్తున్న శబరి ఎక్స్‌ప్రెస్ ఇకపై సూపర్ ఫాస్ట్ రైలుగా మారనుంది. ప్రస్తుతం 17229/30 నంబర్లతో నడుస్తున్న రైలు ఇప్పటి నుంచి 20629/30 నంబర్లతో పరుగులు పెట్టనుంది. గతంతో పోల్చుకుంటే రైలు వేగం పెరగడంతో ఆ రైళ్లలో ప్రయాణించే వారికి సుమారు 2 గంటల ప్రయాణ సమయం ఆదా కానుంది. ఇప్పటివరకు సికింద్రాబాద్ నుంచి రోజూ మధ్యాహ్నం 12.20 గంటలకు బయల్దేరి మరుసటి సాయంత్రం 6.05 గంటలకు త్రివేంద్రంకు చేరుకునేది. తాజాగా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌గా మారాక ప్రతిరోజూ మధ్యాహ్నం 2 గంటలకు సికింద్రాబాద్ నుంచి బయల్దేరి మరుసటి రోజు సాయంత్రం 6.25 గంటలకు చేరనుంది. అలాగే మునుపు త్రివేంద్రంలో ఉదయం 6.45 గంటలకు బయల్దేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.45 గంటలకు సికింద్రాబాద్‌కు వచ్చే ఈ రైలు, ఇప్పుడు త్రివేంద్రంలో ఉదయం 6.45 గంటలకు బయల్దేరి సికింద్రాబాద్‌కు మరుసటి రోజు ఉదయం 11 గంటలకు చేరనుంది. శబరి ఎక్స్‌ప్రెస్ సూపర్ ఫాస్ట్ కావడంతో ప్రయాణికులపై చార్జీల భారం పడనుంది. ప్రయాణికులు జనరల్ సెకండ్ క్లాస్ టికెట్‌కు అదనంగా రూ.15, స్లీపర్ ఏసీ తరగతులకు రూ.30 నుంచి 40 వరకు చెల్లించాల్సి ఉంటుంది. కాగా, ఇప్పటి వరకు దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో ఉండే ఈ రైలు నిర్వహణ బాధ్యతలను ఇప్పటి నుంచి సదరన్ రైల్వే చేపట్టనుందని రైల్వే ఉన్నతాధికారులు వెల్లడించారు.

### నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

### బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ (కిలో) | 125, 134 145 |
| చికెన్ విత్ స్కిన్(కిలో) | 236.00 |
| చికెన్ స్కిన్ లెస్(కిలో) | 246.00 |

## 25,839 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 26,167 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 25,839 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 4,715 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

| వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర | వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర |
|---|---|---|---|---|---|
| **నాన్ ఏసీ కామన్ వెరైటీ** | | | ఆర్మూరు | 9800 | 12000 |
| 334 | 10500 | 14200 | **ఏసీ కామన్ వెరైటీ** | | |
| నెంబరు. 5 | 10000 | 14300 | 334 | 10500 | 14400 |
| 273 | 10000 | 13600 | నెంబరు. 5 | 10000 | 14000 |
| 341 | 10000 | 14700 | 273 | ---- | ---- |
| 4884 | ---- | ---- | 341 | 10000 | 14800 |
| సూపర్ 10 | ---- | --- | 4884 | 10000 | 13500 |
| **నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ** | | | **ఏసీ స్పెషల్ వెరైటీ** | | |
| తేజ | 10000 | 14600 | తేజ | 10000 | 14700 |
| షార్క్-1 | ----- | ---- | బ్యాడిగి | 10000 | 15000 |
| బ్యాడిగి | 10000 | 15000 | దేవనూరు డీలక్స్ | 10500 | 14200 |
| దేవనూరు డీలక్స్ | 10000 | 14000 | తాలుకాయలు | 5000 | 7000 |

# బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె





రేపల్లె: పెనుమూడిలో వరద ఉధృతిపై రెవెన్యూ, పోలీస్,ఆర్‌సీ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

## కరకట్టను తాకిన వరద నీరు

● నీట మునిగిన వాణిజ్య పంటలు
● కొన్ని లంక గ్రామాలకు రాకపోకలు బంద్
● పెనుమూడిపల్లెపాలెం నీటమునక
● పునరావాస కేంద్రాలకు బాధితుల తరలింపు
● వరద ప్రభావాన్ని పరిశీలించిన కలెక్టర్



కొల్లూరు: సుగ్గునలంక చప్టాపై వరద నీరు



కొల్లూరు కరకట్ట దిగువున వరద నీటిలో గృహం



కొల్లూరు: తురకపాలెం వద్ద వరద నీటిలో మామిడి తోట

రేపల్లె, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): కృష్ణానది నుంచి వరదనీరు ఉధృతంగా ప్రవహించటంతో నీటి మట్టం పెరిగి పలు గ్రామాల వద్ద నీరు కరకట్టలను తెంచేలా ప్రవహిస్తోంది. సోమవారం భట్టిప్రోలుమండలం వెల్లటూరు, పెదపులివర్రు, ఓలేరు, రేపల్లె మండలం రావిఅనంతవరం, పల్లెపాలెం, మైనేనివారిపాలెం, కనగాలవారిపాలెం, రుద్రవరం గ్రామాల వద్ద కరకట్టలు బలహీనంగా ఉండటంతో వరదనీరు కరకట్టను ఎప్పుడు తెంచుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ప్రకాశం బ్యారేజీకి వరదనీరు పోటెత్తటంతో దిగువకు 6,61,960 క్యూసెక్కుల వరదనీటిని విడుదల చేశారు. దీంతో వరదనీరు పోటెత్తి ఓలేరుపల్లెపాలెం, పెనుమూడిపల్లెపాలెం నీటిలో మునిగాయి. అక్కడ నివశించే ప్రజలను పడవల ద్వారా పునరావాస కేంద్రాలకు రెవెన్యూ అధికారులు తరలించారు. కరకట్టలపై ఆర్‌సీ, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పల్లపు ప్రాంతాలు, ప్రమాద భరితంగా ఉన్న కరకట్ట వద్ద ఇసుక గోతాలతో కట్టలను బలపరుస్తున్నారు. అయినా రావిఅనంతవరం వద్ద రొయ్యల చెరువులు వరదనీటితో మునిగాయి. కరకట్ట వరకు వరదనీరు చేరింది. మూడు అడుగులు పెరిగితే ప్రమాదం సంభవించే పరిస్థితి నెలకొంది. ఇసుక కట్టలు వేసినా నీరు కట్టపై పొర్లుతోంది. ప్రభుత్వం ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి వారికి సహాయసహకారాలు అందిస్తుంది. వరద ఉధృతి సాగుతుండటంతో గ్రామాలలోని ప్రజలు అప్రమత్తంగా ఉండేందుకు అధికారులు చర్యలను తీసుకుంటున్నారు. పల్లెపాలెం మత్స్యకారులు బోటులోనే జీవనం సాగిస్తున్నారు. వరద ముంపునకు రొయ్యల చెరువులు, పంటపొలాలు ఇప్పటికే కొంతమేర మునిగిపోయాయి. భట్టిప్రోలు, రేపల్లె మండలాల్లోని లంకభూముల్లో వాణిజ్యపంటలైన అరటి, పసుపు, కంద, కూరగాయలు, నిమ్మతోటలు, పూర్తిగా నీట మునిగాయి. మోర్తోట ముక్తేశ్వర స్వామి దేవాలయ గర్భగుడిలోకి మోకాళ్ళలోతు నీళ్ళుచేరాయి.

### కుంగిన అరవపల్లి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ కట్ట

పట్టణ ప్రజల దాహార్తిని తీర్చే అరవపల్లి రోడ్డులోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ కట్ట 30 మీటర్ల మేర కుంగింది. గమనించిన మున్సిపల్ అధికారులు పటిష్టపరిచేందుకు చర్యలు చేపట్టారు. ఈ కట్ట గతంలో ఐదారుసార్లు పైనే కుంగిపోయింది. అధిక వర్షాలు పడినప్పుడల్లా ఈ కట్ట కుంగుతూ వస్తోంది. ప్రస్తుత వర్షాలకు కట్ట కుంగటంతో మున్సిపల్ అధికారులు బాదులు పాతి ఇసుకబస్తాలు వేసి బలపరిచే పనులు ప్రారంభించారు.

● కొల్లూరు, భట్టిప్రోలు: కృష్ణానది వరద ప్రవాహం కరకట్టలను తాకింది. సోమవారం బ్యారేజీ నుంచి 6.75 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో తెల్లవారుజాము నుంచే లంక గ్రామాల్లోని వాణిజ్య పంటలు వరద ముంపునకు గురయ్యాయి. కొల్లూరు మండలంలోని సుగ్గునలంక వద్ద చప్టాపై భారీగా వరద నీరు ప్రవహించడంతో, సుగ్గునలంక, చిలుమూరులంక, కొల్లిపర మండలంలోని అన్నవరపు లంక, కొత్తూరులంక, కృష్ణా జిల్లాలోని మునగపల్లి లంక గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఆవులవారి పాలెం వద్ద పోతార్లంక వైపు కూడా వరద నీరు రోడ్లపై ప్రవహించడంతో ఆయా గ్రామాల ప్రజలు ట్రాక్టర్లపై రాకపోకలు సాగిస్తున్నారు. భట్టిప్రోలు మండలం వెల్లటూరు కరకట్ట దిగువున కూడా రోడ్డుపై వరద నీరు ప్రవహిస్తుంది. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని లంక గ్రామాల్లో వాణిజ్య పంటల్లోకి వరద నీరు పోటెత్తింది. దాదాపు సగం పైగా వాణిజ్య పంటలు వరద ముంపునకు గురయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లోని గృహాల్లోకి అక్కడక్కడ వరద నీరు రావడంతో రెవెన్యూ అధికారులు ఆయా కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు లంక గ్రామాల్లో పర్యటించి ఎప్పటికప్పుడు పరిస్థితిపై తమకు సమాచారం ఇవ్వాలని సిబ్బందికి సూచించారు.



కొల్లూరు: వరద నీటిలో నానుతున్న తమలపాకు తోట



రేపల్లె: వరద పోటెత్తటంతో కరకట్టకు తన్నిన వరదనీరు



రేపల్లె: కుంగిన కట్టకు మట్టిబస్తాలను సిద్ధం చేసిన మున్సిపల్ అధికారులు



రేపల్లె: ఓలేరు డొంకరోడ్డులో పూర్తిగా నీటమునిగిన దొండతోట



ఏరియా వైద్యశాల పరిసరాలను శుభ్రం చేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధార్థ, సిబ్బంది

## ఏరియా వైద్యశాల పరిసరాలు పరిశుభ్రం

బాపట్ల, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా బాపట్ల ఏరియా వైద్యశాలలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధార్థ, వరలక్ష్మీ తదితరులు పాల్గొని పరిసరాలను పరిశుభ్రం చేసి మొక్కలు నాటారు. ఆరోగ్యకరమైన వాతావరణం కోసం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పఠాన్‌మహ్మద్ ఖాన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### ఉచిత వైద్యశిబిరం

కర్లపాలెం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): కర్లపాలెం మండలం పేరలి గ్రామంలోని ఆయుర్వేద హాస్పిటల్‌వారు పేరలి, మేకలవారిపాలెంలో ఉచిత మెడికల్ క్యాంపును సోమవారం నిర్వహించారు. గ్రామంలోని ప్రజలకు షుగర్, బీపీ పరీక్షలు చేసి ఆయుర్వేద మందులు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో హాస్పటల్ డాక్టర్ సిద్ధార్థ, బుద్దాం యునాని రోషన్ ఆరా, చింతాయపాలెం పీఏసీఎస్ ఛైర్మన్ మద్దిబోయిన బుల్లియ్య, సచివాలయ పోలీసు, ఏఎస్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలు అలసత్వం చూపితే సహించేది లేదు

వేమూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తమ విధులను సక్రమంగా నిర్వహించాలని.. అలాగే గర్భిణులు, బాలింతల సేవల్లో అలసత్వం చూపితే సహించేది లేదని సీడీపీవో లక్ష్మీదేవి హెచ్చరించారు. సోమవారం ఆమె వేమూరు, కొల్లూరు మండలాల్లో పర్యటించారు. కొల్లూరు ప్రాంతంలో కృష్ణానది వరద ఉధృతి పెరుగుతున్న కారణంగా కొల్లూరుకి చెందిన 9 నెలల గర్భిణులను వేమూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. వారి పర్యవేక్షణ పూర్తిగా డాక్టర్‌కు అప్పగించారు. వేమూరు పరిధిలోని కార్యకర్తలు ఎప్పటికప్పుడు ఆసుపత్రిలో చేర్పించిన గర్భిణుల విషయంపై సమాచారం తీసుకోవాలన్నారు. అనంతరం సెక్టార్ సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడుతూ, కేంద్రాల పరిధిలో పనిచేసే ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలన్నారు. గృహ సందర్శన ద్వారా గర్భిణులు, బాలింతల రక్త పరీక్షల విషయంలో శ్రద్ధగా సేవలందించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అమృతవాణి, సెక్టార్ పరిధి కార్యకర్తలు పాల్గొన్నారు.

### బాపట్ల ఫోటోగ్రాఫర్ ఏడుకొండలుకు ప్రథమ బహుమతి

బాపట్ల, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చుండూరు మండలం మోదుకూరు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ఫోటోగ్రఫి అనుబంధ సంస్థ ఫోటోజానిక్ ఆర్ట్ సర్కిల్ నిర్వహించిన దసరా ఫోటోగ్రఫి పోటీలలో బాపట్ల మండలం ఆదర్శనగర్‌కు చెందిన ఫోటోగ్రాఫర్ సంగాని ఏడుకొండలకు ప్రథమ బహుమతి లభించింది. మోదుకూరులోని వేమన సాహితి వికాసభవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పురావస్తు పరిశోధకులు ఈమని సింగిరెడ్డి, మిల్కియార్ తదితరులు ఏడుకొండలకు బహుమతిని అందజేశారు.

## రుణాల సద్వినియోగంతో ఆర్థికాభివృద్ధి: ఎమ్మెల్యే వేగేశన

● వీధి విక్రయదారులకు రూ.50 లక్షలు..
● డ్వాక్రా మహిళలకు రూ.7.27 కోట్లు పంపిణీ



వీధి విక్రయదారులకు రూ.50లక్షల చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, అధికారులు

బాపట్ల, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): వీధి విక్రయదారులు బ్యాంక్ రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పేర్కొన్నారు. బాపట్ల మున్సిపల్ కార్యాలయంలో సోమవారం పీఎం స్వనిధి పథకం 2.0లో భాగంగా లోకకల్యాణ మేళా కార్యక్రమం నిర్వహించారు. మెప్మాసీఎంఎం నర్రా సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వందమంది వీధి విక్రయదారులకు రూ.50లక్షల చెక్కులను అందజేశారు. అదేవిధంగా డ్వాక్రా మహిళలకు బ్యాంక్ లింకేజీ రుణాలు కింద రూ.7.27కోట్ల నగదు చెక్కులను అందజేశారు. అనంతరం వారికి వైద్యశిబిరంలో వైద్య సేవలందించారు. డిజిటల్ పేమెంట్స్ మీద అవగాహన కల్పించారు. కొత్త దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, ఎల్‌డీఎం శివకృష్ణ, మెప్మా పీడీ ఆనంద్‌సత్యపాల్, యూబీఐ, కెనరా, సీజీజీబీల మేనేజర్లు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, కార్పొరేషన్ డైరెక్టర్ ఆంద్రేయ, నాగవరలక్ష్మీ, సీవో విజయలక్ష్మి పాల్గొన్నారు.

## జీఎస్టీతో తగ్గిన ధరలు

● మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు

రేపల్లె, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): వివిధ రకాల వస్తువులపై ప్రభుత్వం జీఎస్టీని తగ్గించటంతో వాటి ధరలు గణనీయంగా తగ్గాయని మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీ కౌన్సిల్లో తీసుకున్న నిర్ణయాల ప్రకారం వివిధ గృహోపకరణ వస్తువులు, మందులు, ఆటోమొబైల్స్ నిర్మాణసామాగ్రిపై జీఎస్టీపన్ను గణనీయంగా తగ్గించాయి. ఇది ఈ నెల 22నుంచి అమలుల్లోకి వచ్చిందన్నారు. జీఎస్టీ తగ్గిన విషయం ప్రతి ఇంటికి తిరిగి తెలియజెయ్యాలని సూచించారు. ఎస్‌హెచ్‌జీ సభ్యులకు వార్డు సెక్రటరీలకు సచివాలయ పరిధిలోని ప్రజలకు తెలపాలనిసూచించారు.

### జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పించాలి

వేమూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు తెలిసేలా అవగాహన కార్యక్రమాన్ని గ్రామాల్లో నిర్వహించాలని ఎంపీడీవో రవికుమార్ పేర్కొన్నారు. సోమవారం రోశయ్య మీటింగ్ హాలులో సచివాలయాల ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, సచివాలయ ఉద్యోగులు ఇంటింటి ప్రచారం ద్వారా నెల రోజుల పాటు ధరల వ్యత్యాసం, తగ్గుదలపై ప్రజలకు వివరించాలన్నారు. అక్టోబరు 19న గ్రామ, మండలస్థాయిలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటుచేయాలన్నారు. ట్రైనర్స్ శ్రీనివాసరెడ్డి, సాధిక్ ఆలీ, జీఎస్టీ ధరల తగ్గింపు వివరాలు, వ్యత్యాసాలను తెలిపారు. సమావేశంలో 17 గ్రామాల సచివాలయ ఉద్యోగులు, పీఎస్‌లు పాల్గొన్నారు.



భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని హరిప్రసాద్

### టీడీపీ కార్యకర్తకు నివాళి

కొల్లూరు సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్త తాళ్లూరి వెంకటేశ్వరరావు భౌతికకాయానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సోమవారం మండలంలోని క్రాపలో టీడీపీ సీనియర్ నాయకుడు తాళ్లూరి వెంకటేశ్వరరావు మృతి చెందిన విషయం తెలుసుకున్న టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ కార్యకర్త భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు కోగంటి హరిప్రసాద్ పాల్గొన్నారు.



పునరావాస కేంద్రాల్లో బాధితులకు భోజనం వడ్డిస్తున్న అనగాని శివప్రసాద్, తహసీల్దార్

## వరద బాధితులకు అండగా నిలుస్తాం

● ఎలాంటి భయాందోళన చెందవద్దు..

రేపల్లె, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): కృష్ణానదికి వరదనీరు పోటెత్తటంతో కరకట్ట వెంబడి ఉన్న నీటమునిగిన గ్రామాల్లోని ప్రజలకు అండగా నిలుస్తామని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని పెనుమూడి, పల్లెపాలెం, మైనేనివారిపాలెం తదితర గ్రామాల్లో పర్యటించి వరద బాధితులకు భరోసానిచ్చారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ సూచనలతో కృష్ణా కరకట్టను బలపరిచేలా చర్యలు చేపట్టాలని ఆర్‌సీఏఈ నాగేశ్వర్‌నాయక్ రెవెన్యూ సిబ్బందికి సూచించారు. బలహీనంగా ఉన్న కరకట్టలను ఇసుకబస్తాలతో పటిష్టంచేసేలా దగ్గరుండి పనులను పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచెయ్యాలని సూచించారు. ఏ ఇబ్బంది వచ్చిన తమ దృష్టికి తెస్తే సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. అనంతరం పల్లెపాలెంలోని వరద బాధితులకు భోజనాన్ని సమకూర్చి వడ్డించారు. కార్యక్రమంలో కృష్ణాపశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ పంతాని మురళీధరరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో విజయ, తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు, ఆర్‌సీ ఏఈ నాగేశ్వర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదుల పరిష్కారంలో ప్రథమ ప్రాధాన్యం

ఎస్పీ బి.ఉమామహేశ్వర్



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ ఉమామహేశ్వర్

బాపట్ల, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారవేదికకు వచ్చిన అర్జీలను ప్రథమ ప్రాధాన్యతతో పరిష్కరించాలని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు జిల్లాలోని వివిధ ప్రాంతాలు నుంచి 56మంది వచ్చి అర్జీల ద్వారా తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల అర్జీలను చట్టపరిధిలో నిర్దిష్ట గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పరిష్కరించటంలో జవాబుదారీతనంతో ఉండాలన్నారు. అర్జీలను నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించబోమని పోలీసు అధికారులను హెచ్చరించారు. కుటుంబ కలహాలు, భూవివాదాలు, ఆర్థికలావాదేవీలు, మోసాలు ఇతర సమస్యలను అర్జీదారులు ఎస్పీకి వివరించారు. కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్‌నాయక్, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య వ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్న ఎన్డీయే కూటమి

● కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం



మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం

బాపట్ల, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎన్డీయే కూటమి ప్రజాస్వామ్య వ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్నదని కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం విమర్శించారు. పట్టణంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో జిల్లా అధ్యక్షుడు అమంచి కృష్ణమోహన్ అధ్యక్షత, జేడీ శీలం మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ దొంగ ఓట్లతో గెలిచిందని ఆరోపించారు. రాహుల్‌గాంధీని ప్రధానిగా గెలిపించుకోవటం కోసం పార్టీ శ్రేణులంతా కలిసికట్టుగా సాగాలన్నారు. పీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల ఆధ్వర్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ముందుకెళుతున్నట్లు తెలిపారు. దివాళాకోరు రాజకీయాలు చేస్తున్న ఎన్డీయే కూటమికి దేశ ప్రజలను పరిపాలించే అర్హత లేదన్నారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేసి ప్రాంతీయ పార్టీలు చేతులు దులుపుకుంటున్నాయని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అమంచి కృష్ణమోహన్ మాట్లాడుతూ ప్రధాని మోదీకి దాసోహంగా రాష్ట్రప్రభుత్వం పనిచేస్తుందని దుయ్యబట్టారు. పర్చూరు నియోజకవర్గంలో వేల దొంగ ఓట్లు బయటకు తీశామన్నారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి గంటా అంజిబాబు, పార్లమెంట్ పరిశీలకులు గడ్డం విజయ్‌పాల్, పీసీసీ కార్యదర్శి తాడికొండ వెంకటేశ్వరరావు, కేశన రామకోటేశ్వరరావు, జ్యోతి, దోనేపూడి దేవరాజు తదితరులు పాల్గొన్నారు.




బ్యానర్‌ను అవిష్కరిస్తున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, డీఎంహెచ్‌వో విజయమ్మ

## నవ్వుతో గుండె ఆరోగ్యం

● కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): గుండె ఆరోగ్యంగా ఉండాలంటే ఎప్పుడూ నవ్వుతూ ఉండాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం వరల్డ్ హార్ట్ డే సందర్భంగా బ్యానర్ అవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గుండె ఆరోగ్యకరమైన స్థితిలో ఉండటానికి ఉత్తమ మార్గం సరైన ఆహారం, నిద్ర, ఒత్తిడికి దూరంగా ఉండటం గుండెకు మేలు చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్. విజయమ్మ, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, డీసీ డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ లలిత రాజేశ్వరి, సీహెచ్‌వో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సరస్వతీ నమస్తుభ్యం..!

రేపల్లె, బాపట్ల, పిట్టలవానిపాలెం, కర్లపాలెం, కొల్లూరు, చెరుకుపల్లి, అమృతలూరు, వేమూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం మూలానక్షత్రాన్ని పురస్కరించుకుని బాపట్ల జిల్లాలోని ఆలయాలలో అమ్మవారిని సరస్వతిదేవిగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమంతో పాటు అమ్మవారికి సామూహికంగా కుంకుమ పూజలు జరిపించారు. జంపని రామేశ్వరాలయం, చావలి వాలేశ్వరాలయం, అబ్బనగూడవల్లి శివాలయంలో అమ్మవారిని సరస్వతిదేవిగా అలంకరించారు.




అమృతలూరు: సరస్వతీ దేవి అలంకరణలో అమ్మవారు



రేపల్లె: నాట్య ప్రదర్శనచేస్తున్న చిన్నారులు



వేమూరు: జంపని రామేశ్వరాలయంలో సరస్వతిదేవి అలంకారం




కర్లపాలెంలోని శ్రీపోలేరమ్మ ఆలయంలో సరస్వతిదేవి అలంకరణలో అమ్మవారు



రేపల్లె కన్యకాపరమేశ్వరి ఆలయంలో సరస్వతిదేవీగా దర్శనమిచ్చిన దుర్గమ్మ



చెరుకుపల్లి: నడింపల్లి శ్రీదుర్గాంబ సమేత శిఖరేశ్వరస్వామివారి ఆలయంలో సరస్వతిదేవిగా..



బాపట్ల సూర్యలంకరోడ్డులో శ్రీలలితా త్రిపురసుందరి పీఠంలో సరస్వతీ దేవిగా..



బాపట్ల చీలురోడ్డు సెంటర్‌లో శ్రీరుక్మిణి సమేత పాండురంగాస్వామి ఆలయంలో శ్రీ సరస్వతీదేవిగా..



పిట్టలవానిపాలెం: శ్రీ సరస్వతీ దేవి అలంకరణలో శ్రీఅన్నపూర్ణాదేవి అమ్మవారు



పిట్టలవానిపాలెం: శ్రీసరస్వతీదేవి అలంకరణలో శ్రీరాజ్యలక్ష్మీ అమ్మవారు

# జల దిగ్బంధంలో లంకలు

● ముంచెత్తుతున్న కృష్ణమ్మ ● రోడ్లపైకి నీరు చేరటంతో దారులు మూత ● ఇళ్లలోకి వరద నీరు... లోతట్టు గ్రామాల నుంచి సురక్షిత ప్రాంతాలకు

ప్రకాశం బ్యారేజ్ వద్ద కొనసాగుతున్న రెండో ప్రమాద హెచ్చరిక


మోర్తోట ముక్తేశ్వరస్వామి దేవాలయ మండపంలో చేరిన వరద నీరు


పెనుమూడిలో పునరావాస కేంద్రాల్లో ఉన్న పల్లెపాలెం వాసులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

రేపల్లె, తెనాలి, కొల్లూరు, కొల్లిపర, దుగ్గిరాల, సెప్టెంబరు 29, (ఆంధ్రజ్యోతి): వరద ముంపు లంక గ్రామాల వాసులను భయభ్రాంతులకు గురిచేసింది. ప్రకాశం బ్యారేజికి ఇన్‌ఫ్లో 6,61,960 క్యూసెక్కుల వరద నీరు ఎగువ నుంచి వచ్చి చేరుతుంటే, వాటిలో కృష్ణా డెల్టా కాల్వలకు వదలగా మిగిలిన 6,46,821 క్యూసెక్కుల వరద నీటిని మాత్రం సముద్రంలోకి వదిలేస్తున్నారు. అయితే ఎగువ జలాశయాల నుంచి వస్తున్న వరదకు తోడు, బ్యారేజి క్యాచ్‌మెంట్ ప్రాంతం నుంచి వస్తున్న వరద కూడా ఎక్కువగా ఉండటంతో ముంపు సమస్య తీవ్రమవుతోంది. దీనికితోడు సముద్రంలో పోటు కూడా సోమవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఉండటంతో నదిలో వరద నీరు ఎదురు తన్నటంతో అటు పెనుమూడి ప్రాంతంలో లో తట్టు ప్రాంతాలు నీట మునిగాయి. సాయంత్రం నుం చి ఆటు ఏర్పడటంతో కాస్తంత తగ్గుముఖం పట్టినట్టయింది. అయితే మరో మూడు రోజులు ఇదే పరిస్థితి కొనసాగుతుందని, ప్రవాహంలో హెచ్చుతగ్గులు ఉంటాయని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు.

**లంక గ్రామాలకు రాకపోకలు బంద్!**

ప్రకాశం బ్యారేజి దిగువన గుంటూరు జిల్లాలో తీర గ్రామాలకు పెద్దగా ఇబ్బంది లేకున్నా, నది మధ్యలో ఉన్న కొల్లిపర మండలం కొత్తూరులంక, అన్నవరపు లంక గ్రామాలకు బాపట్ల జిల్లా కొ ల్లూరు మండలంలోని అరవింద వారధి నుంచి వెళ్లాల్సి ఉండటం తో సుగ్గునలంక దగ్గర చప్టాపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపాయాయి. వీటికి అనుకుని ఉన్న కృష్ణా జిల్లా తోట్లవల్లూరు మండలానికి చెందిన కనిగిరిలంక గ్రామానికీ రాకపోకలు లేకుండా పోయాయి. అటు బాటప్ల జిల్లాలోని కొల్లూరు మండలంలో నది మధ్యనున్న 11 లంక గ్రామాలకు రవాణా పూర్తిగా నిలిచిపోయింది. మరోపక్క కరకట్ట నుంచి లంక గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిపైకి కూడా నీరు పొంగిపొర్లే పరిస్థితి ఉండటంతో స్థానికులు అప్రమత్తమయ్యారు. గాజుల్లంకకు వెళ్లే రోడ్డుపైనా వరద నీరు ప్రవహిస్తోంది. గాజుల్లంక-పోతార్లంక మధ్య రోడ్డుపై కూడా వరద ఉధృతి పెరగటంతో ఆ మార్గంలోనూ రాకపోకలు నిలిచిపోయాయి. దోనేపూడి-పోతార్లంక మధ్య చిన్నరేవు చప్టాపైకి వరద నీరు చేరటంతో పడవలపై వెళ్లాల్సిన పరిస్థితి. భట్టిప్రోలు మండలం ఓలేరు పల్లెపాలెం దగ్గర చిన్నరేవు ఉధృతంగా ఉండటం, గ్రామంలోని లోతట్టు ప్రాంతంలో ఉన్న ఇళ్లలోకి వరద నీరు క్రమంగా చేరుతుండటంతో ముంపు సమస్య ఉన్న కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

**'ముదినేపల్లి' నుంచే భారీ వరద**

కృష్ణా నది ఎగువ జలాశయాల నుంచి వస్తున్న వరద కంటే బ్యారేజి క్యాచ్‌మెంట్ ప్రాంతం నుంచి వస్తున్నదే ఎక్కువగా ఉంది. ప్రకాశం బ్యారేజికి సోమవారం ముదినేపల్లి వాగు నుంచి 5,57,816 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుంటే, పాలేరు నుంచి 26,804 క్యూసెక్కులు, కీసర నుంచి 21,284 క్యూసెక్కుల వరద దిగువకు వస్తోంది. సోమవారం ఉద యం 6 గంటలకు 6,86,074 క్యూసెక్కుల వరద నీరు బ్యారేజికి చేరితే, అది మధ్యాహ్నానికి 6,81,383 క్యూ సెక్కులకు తగ్గింది. సాయంత్రానికి 6,61,960 క్యూసెక్కులు తగ్గింది. వీటిలో కృష్ణా డెల్టా కాల్వలకు 15,139 క్యూసెక్కులు వదులుతున్నారు. కేఈ మెయిన్ కెనాల్‌కు 8,617 క్యూసెక్కులు, కె.డబ్ల్యు మె యిన్ కెనాల్‌లకు 6,522 క్యూసెక్కులు వదులుతున్నారు. నదిలోకి మాత్రం 6,46,821 క్యూసెక్కుల వరద నీటిని వదిలేస్తున్నారు. బ్యారేజి నీటి మట్టం అత్యధిక స్థాయిలో ఉంది. 13 అ డుగుల సామర్థ్యం ఉన్న బ్యారేజి దగ్గర సోమవారం ఉదయం 16.4 అడుగుల మేర నీటి మట్టం ఉంటే, సాయంత్రానికి క్రమంగా తగ్గుతూ 16 అడుగులకు చేరింది. తగ్గుదల అయితే కేవలం 4 అంగుళాలే తగ్గినట్టయింది. హెచ్చుతగ్గులున్నా, భారీస్థాయిలో ఉండకపోవచ్చని, నిలకడగా వరద కొనసాగుతుందని అధికారులు చెబుతున్నారు.


కొల్లూరు : వరద నీటిలో మునిగిపోయిన అరటి తోట


కొల్లూరు : వరద నీటిలో కూరగాయ పంటలు

## 9 నెలల గర్భిణి, మరో 11 మంది సురక్షిత ప్రాంతానికి తరలింపు

కొల్లిపర మండలం అన్నవరపు లంకలో చిక్కుకున్న పందిపాటి సౌజన్య 9వ నెల గర్భిణి కావటం, వరద ఉధృతి పెరుగుతుందన్న భయంతో అధికారులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన కొల్లిపర ఇన్‌ఛార్జ్ తహసీల్దార్ గోపాలకృష్ణ ప్రత్యేకంగా పడవ ఏర్పాటుచేసి, ఆమెను అన్నవరపులంక నుంచి బొమ్మువానిపాలెం తరలించారు. ఆమెతోపాటే నరసరావుపేటకు చెందిన మరో 11 మంది కూడా అదే గ్రామంలో చిక్కుకున్నామని సమాచారం ఇవ్వటంత వారినికూడా పడవలో సురక్షిత ప్రాంతానికి తరలించారు. మరోపక్క బాపట్ల జిల్లా వెల్లటూరు దగ్గర చిన్నరేవు దాటే ప్రయత్నంలో తిప్పకలట్టకు చెందిన తండ్రి, కుమారుడు ప్రమాదవశాత్తు జారి నీటిలో పడిపోవటం, కొట్టుకుపోతున్న తరుణంలో స్థానికులు అప్రమత్తమయి కొందరు యువకులు నీటిలో దూకి వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. దీంతో ప్రాణాపాయం తప్పింది. స్థానికులు అర్ధగంటసేపు ఉత్కంఠత మధ్య చివరకు ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలా ఉంటే... వరద ముందస్తు జాగ్రత్తల నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేశామని, లోతట్టు ప్రాంతాల నుంచి ఏ సమయంలోనయినా జనాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని తెనాలి సబ్‌కలెక్టర్ సంజన సింహ చెప్పారు. నది మధ్య ఉన్న లంక గ్రామాల్లో ఉన్నవారికి అవసరమైన అత్యవసర సరకులు కూడా సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. ఎవరూ భయపడాల్సిన పనిలేదని, ఎవరైనా ఏ ఇబ్బంది ఉందని సమాచారం అందించినా వెంటనే వారికి సహాయ సహకారాలు అందించేందుకు తాము సిద్ధంగాఉన్నట్లు ఆమె పేర్కొన్నారు.


రావిఅనంతవరం సమీపంలో కృష్ణానదికి ఆనుకుని ఉన్న రొయ్యల చెరువుకు గండిపడటంతో ఉధృతంగా వస్తున్న వరదనీరు

## వదంతులను నమ్మవద్దు

**మంత్రి అనగాని సత్యప్రసాద్**



రేపల్లె, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : తీరప్రాతంలోని కృష్ణానదికి వరద పోటెత్తటంతో రేపల్లె,వేమూరునియోజకవర్గాల్లోని లంకగ్రామాల ప్రజలు కరకట్టవెంబడి ఉన్న గ్రామాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నామని రెవెన్యూ శాఖ మంత్రి అనగానిసత్యప్రసాద్ పేర్కొన్నారు. ప్రకాశంబ్యారేజీకి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో కృష్ణానది పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్,కృష్ణారివర్‌అథారిటీ అధికారులుసమన్వయంతో పనిచేస్తూ కరకట్టకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీచేశారు. కృష్ణానది పొంగిపొర్లుతున్న నేపథ్యంలో ప్రజలు,కాల్వలు, నదిని దాటే ప్రయత్నం చెయ్యవద్దని ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. సోషల్‌మీడియాలో వస్తున్న వదంతులను నమ్మవద్దని ఎటువంటి విపత్తునైన ఎదుర్కొనేందుకు రాష్ట్రప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి తెలిపారు.

## అండగా నిలుస్తాం : కలెక్టర్

కృష్ణా నదికి వరదపోటెత్తటంతో కరకట్టవెంబడిఉన్న భట్టిప్రోలుమండలం పల్లెపాలెం, రేపల్లెమండలం పల్లెపాలెం, మైనేనివారిపాలెం, లంకెవానిదిబ్బ గ్రామాల్లోని ప్రజలు ఎలాంటి భయాందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాల్లో ఉండాలని జిల్లాకలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. సోమవారం వరద ముంపు గ్రామాలను ఆయన పరిశీలించారు. పెనుమూడిలో పల్లెపాలెం పూర్తిగా నీటమునగటంతో పునరావసకేంద్రాల్లో ఉన్న బాధితులను పరామర్శించి ధైర్యంచెప్పారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న బాధితులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆహార పానీయాలు, విద్యుత్, ఫ్యాన్‌లను ఏర్పాటు చెయ్యాలని రెవెన్యూఅధికారులకు సూచించారు. ప్రత్యేకంగా మెడికల్‌క్యాంప్ ఏర్పాటుచేసి బాధితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని అవసరమైనవారికి తగిన మందులు అందించాలని సూచించారు.

## హోరాహోరీగా జాతీయ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు


చెస్ ఆడుతున్న క్రీడాకారులు

గుంటూరు (విద్య), సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని విజ్ఞాన్ యూనివర్సిటీలో 62వ జాతీయ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతున్నాయి. సోమవారం జరిగిన ఎనిమిదో రౌండ్‌లో నాలుగుసార్లు జాతీయ చాంపియన్ పీఎస్‌పీ బీకి చెందిన జీఎం కృష్ణన్ శశికిరణ్ తన జట్టుకే చెందిన సహచరుడు జీఎం.దీప్‌సేన్ గుప్తాపై గెలుపొందాడు. అదే జట్టుకు చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ అభిజిత్ గుప్తా యూపీకి చెందిన ఐఎం ఎలెక్ట్ అజయ్ సంతోష్ పర్వత్‌రెడ్డిపై విజయం సాధించాడు. దీంతో శశికిరణ్, అభిజిత్ చెరో 7 పాయింట్లతో టాప్‌లో నిలిచారు. వీరికి సగం పాయింట్ల వెనుక ఆరుగురు ఆటగాళ్లు ఉన్నారు.

## ఏపీ కాటన్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు కొర్రపాటి రామారావు

గుంటూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కాటన్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం ఎన్నికైంది. 2025-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడిగా కొర్రపాటి రామారావు, గౌరవాధ్యక్షుడిగా పెరవలి రాఘవరావు, ఉపాధ్యక్షులుగా పి.వీరనారాయణ, డీఎల్ఎస్ ప్రసాదు, గౌరవ కార్యదర్శిగా ఎం.సురేంద్రబాబు, సంయుక్త కార్యదర్శులుగా ఎం.రంగారావు, ఎన్.సుబ్బా రావు, గౌరవ కోశాధికారిగా ఎన్.సూర్యనారాయణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రామారావు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా కాటన్ వ్యాపారస్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామి ఇచ్చారు.

## సరిహద్దులు లేని సంస్థ సంగం డెయిరీ

● రూ. 2,019 కోట్లకు చేరిన టర్నోవర్ ● డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సరిహద్దులు లేని సంస్థగా సంగం డెయిరీని విస్తరించేందుకు కృషి చేస్తున్నట్లు సంగం డెయిరీ ఛైర్మన్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ పేర్కొన్నారు. వడ్లమూడి సంగం డెయిరీ అవరణలో సోమవారం సంగం సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో సంగం డెయిరీతో పాటు డీవీసీ ఆసుపత్రి వార్షిక ప్రగతి నివేదికను ప్రవేశపెట్టి సభ్యుల ఆమోదంతో తీర్మానం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఛైర్మన్ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ, తాను ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సమయంలో 45 వేల లీటర్ల పాల సేకరణ మాత్రమే జరిగేదని, కాని నేడు సమిష్టి కృషితో రోజుకు 10 లక్షల లీటర్లకుపైగా పాల సేకరణ చేపట్టేలా పాలకవర్గం నిర్ణయం తీసుకుందని చెప్పారు. ఈ ఏడాది సంగం డెయిరీ 2,019 కోట్ల టర్నోవర్ సాధించిందని.. వచ్చే ఏడాది 2,300 కోట్ల టర్నోవర్ సాధించడమే లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. గడిచిన ఏడాది రైతులకు బోనస్ పంచగా రూ. 12.79 కోట్ల నికర లాభం ఆర్జించినట్లు తెలిపారు. కంపెనీ విస్తరణలో భాగంగా నూతన పాల శీతలీకరణ కేంద్రాల ఏర్పాటు, నాయుడుపేటలో నూతన డెయిరీ నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. మిర్యాలగూడలో ఏర్పాటు చేసిన ప్లాంట్‌లో రోజుకు లక్షన్నర లీటర్ల పాల సేకరణ చేపట్టి హైదరాబాద్‌కు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా నూతన ఉత్పత్తులను రూపొందిస్తున్నామని, అందులో భాగంగా షుగర్ ఫ్రీ ఉత్పత్తులను రూపొందించి మార్కెట్లోకి ప్రవేశపెడుతున్నామని చెప్పారు. రైతులకు సౌలభ్యం కోసం ఫార్మర్ యాప్ అమలు చేయనున్నట్లు తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి ఆవు నెయ్యి సరఫరా కాంట్రాక్టు దక్కడం సంగం డెయిరీకి లభించిన అదృష్టమని నరేంద్ర కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా టెన్నిస్ క్రీడాకారిణి నలుగుదుటి అనూషకు రూ. 5 లక్షల ప్రోత్సాహక నగదును ఛైర్మన్ నరేంద్ర కుమార్ అందజేశారు. అనంతరం అత్యధిక పాలు పోసిన రాష్ట్రంలోని పలువురు రైతులను ఘనంగా సత్కరించి ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సంగం డెయిరీ ఎండీ పి. గోపాలకృష్ణ, డీవీసీ ఆసుపత్రి ఎండీ ధూళిపాళ్ళ జ్యోతిర్మయి, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

## కనక దుర్గమ్మకు 108 వీణలతో సంగీతార్చన


108 వీణలతో సంగీతార్చన చేస్తున్న మహిళలు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం తెనాలి చెంచుపేటలో అమ్మవారికి 108 వీణలతో సంగీతార్చన చేశారు. చెంచుపేట పద్మావతి కళ్యాణ మండపంలో శ్రీ విద్యా పీఠం ఆధ్వర్యంలో పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామి) మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. సాలిగ్రామ మఠం, జయలక్ష్మి నాట్యమండలి ఆధ్వర్యంలో 108 మంది మహిళా భక్తులు ఒకే రమమైన దుస్తులు ధరించి బాలస్వామితో అమ్మవారిని స్తుతిస్తూ పలు కీర్తనలు ఆలపించారు. రెండు గంటల పాటు వీణపై ఆలపించిన భక్తి గీతాలు భక్తులకు వీనుల విందు చేశాయి. నంబూరు వెంకటకృష్ణమూర్తి, కొత్త సుబ్రహ్మణ్యం, రావూరి సుబ్బారావు, పెనుగొండ వెంకటేశ్వరరావు, మురళీ మనోహర్, రామకృష్ణ, రాజేశ్వరరావు, ముద్దా భక్తుని రమణయ్య, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

## వినుకొండ కీర్తిని ఇనుమడింపజేసిన జాషువా

- జ్ఞాపకార్థం డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు: చీఫ్‌విప్ జీవీ
- ఘనంగా విశ్వకవి 130వ జయంతి వేడుకలు




పెనుగొండ లక్ష్మీనారాయణ, నల్ల వెంకటేశ్వరరావుకు పురస్కారాలు ప్రదానం చేస్తున్న చీఫ్‌విప్ జీవీ, మక్కెన

వినుకొండ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): తన కవిత్వంతో.. సమాజంలోని అసమానతలను ఎత్తుచూపుతూ.. వెయ్యేళ్ల తెలుగు సాహిత్యంలో నిప్పు కణికలాగా గుర్రం జాషువా ఉద్భవించాడని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. వినుకొండలో పుట్టి జాషువా అంటరానితనం, పేదరికాన్ని తన గురువులుగా ఎంచుకొని.. గబ్బిలాన్ని కదా వస్తువుగా ఎంచుకొని కవిత్వంలో విజయవతం అయ్యారన్నారు. నరసరావుపేట రోడ్డులోని జాషువా కళా ప్రాంగణంలో జాషువా సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షుడు చిలకల జాన్ సుందరరావు అధ్యక్షతన గుర్రం జాషువా 130వ జయంతి ఉత్సవాలు ఆదివారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ.. జాషువా దేశవిదేశాల్లో వినుకొండ కీర్తిని ఇనుమడింపజేశారన్నారు. ఆయన జ్ఞాపకంగా వినుకొండలో ఎన్ఎస్‌పీ కాలనీ ఆవరణలో డిజిటల్ లైబ్రరీని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఖాసిం మాట్లాడుతూ.. వినుకొండలో.. 'ముసలివాడైన బ్రహ్మకు పుట్టినారట నలుగురు కుమారులు. మరి పంచమ జాతి పుట్టుటకు మూలమేమిటి?' అని జాషువా ప్రశ్నిస్తే ఈ రోజుకి సమాధానం చెప్పిన వారు లేరన్నారు. జాషువా 130వ జయంతి వేడుకల సందర్భంగా కళా ప్రాంగణంలో ఉదయం నుంచి రాత్రి వరకు నిర్వహించిన పద్య, కవిత్వం పోటీల్లో ప్రతిభ కనబరిచిన కళాకారులకు ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు, జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు బహుమతులు ప్రదానం చేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, ప్రముఖ రంగస్థలం కళాకారుడు నల్ల వెంకటేశ్వరరావుకు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ షకీలా, సమైక్య కార్యదర్శి రెడ్డిబోయిన ప్రసన్నకుమార్, న్యాయవాదులు సీహెచ్ మూర్తి, విజయ్, జి.కమలారం, భాగవతుల రవికుమార్, ప్రదీప్, పిడుగు విజయ్, దేవ, లగడపాటి వెంకట్రావు, హనుమంత రెడ్డి, బొంకూరు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

**గుర్రం జాషువా రచన నాటక ప్రదర్శనలు**

జీవన్‌జ్యోతి స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో గుర్రం జాషువా రచించిన శ్మశాన వాటిక, గబ్బిలం, ముంతాజ్‌మహల్, పిరదౌసి ఘట్టాలను పద్యనాటకాల ద్వారా కళాకారులు బస్టాండ్ సెంటర్‌లో ప్రదర్శించారు. ఈ పద్య నాటకాలు పట్టణ వాసులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో చీఫ్‌విప్ జీవీ, జీడీసీసీబీ ఛైర్మన్ పాల్గొని జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి కళాకరులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మందా వెంకట్రావు, బీజేపీ జిల్లా కార్యదర్శి కట్టాసుబ్బారావు, పి.వి.సురేష్, కవులు, కళాకారులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

## 26 క్రస్ట్‌గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల



విజయపురిసౌత్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌కు వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు సోమవారం 26 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. కాగా సాగర్ జలాశయం నీటిమట్టం 585.30 అడుగులు ఉంది. ఇది 298.30 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9533 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5800 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,414 క్యూసెక్కులు, 24 క్రస్ట్‌గేట్లను 15 అడుగులు, 2 క్రస్ట్ గేట్లను 20 అడుగులు మేర ఎత్తి 5,41,516 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1200, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 5,91,463 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 5,91,463 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

**సత్రశాలలో 18 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల**

రెంటచింతల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వస్తోంది. దాంతో ప్రాజెక్టు 18 క్రస్ట్ గేట్లను ఎత్తి 5,88,988 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టుకు ఎగువన ఉన్న సాగర్ నుంచి 5,74,240 క్యూసెక్కుల నీరు వస్తుండగా.. రిజర్వాయర్‌లో 73.10 మీటర్ల మేర నీరుదని ఇది 5.543 టీఎంసీలకు సమానమని ప్రాజెక్టు ఎస్ఈ కె.వెంకరమణ, ఈఈ సుబ్రహ్మణ్యం, గిరిబాబు తెలిపారు. వరద నీరు భారీగా వస్తుండడంతో ప్రాజెక్టులో విద్యుదుత్పత్తిని పూర్తిగా నిలిపివేసినట్లు చెప్పారు. కాగా, సత్రశాల ఆలయం సమీపంలో వరద నీరు ఉగ్రరూపం దాల్చడంతో విద్యుత్ స్తంభాలు నీట మునిగాయి. దాంతో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.

**పులిచింతల సమాచారం**

అచ్చంపేట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 37.99 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 5,92,400 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు వచ్చి చేరుతోందని ఆయన చెప్పారు. ప్రాజెక్టు వద్ద 16 గేట్లను ఐదు మీటర్ల మేర ఎత్తి 5,68,511 క్యూసెక్కులు, లీకుల ద్వారా 400 క్యూసెక్కులు, మొత్తం 5,68,911 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ఏఈ రాజు తెలిపారు.

**పశ్చిమడెల్టాకు 5,924 క్యూసెక్కుల నీరు**

దుగ్గిరాల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారే జి నుంచి పశ్చిమడెల్టాకు సోమవారం 5,924 క్యూసెక్కుల నీటిని విడు దల చేశారు. ప్రస్తుతం బ్యారేజి వద్ద 16.2 అడుగుల నీటిమట్టం ఉండగా దిగువకు 6,61,960 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దుగ్గిరాల సబ్ డివిజన్ నుంచి హై లెవెల్ చానల్‌కు 230 క్యూసెక్కులు, రేపల్లె కా ల్వకు 1,513 క్యూసెక్కులు, తూర్పు కాల్వకు 502 క్యూసెక్కులు, పశ్చిమ కాల్వకు 190 క్యూసెక్కులు, నిజాంపట్నం కాల్వకు 335 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 2,880 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

**దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు**

స్థానిక పసుపు మార్కె ట్ యార్డులో సోమవారం జరిగిన వేలంలో 569 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.9,450, గరిష్ఠ ధర రూ.10,375, మోడల్ ధర రూ.10,300 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.9,450, గరిష్ఠ ధర రూ.10,300, మోడల్ ధర రూ.10,300 పలికాయి.

## ప్రకాశం బ్యారేజీ వద్ద స్థిరంగా వరద ఉధృతి

● దిగువకు 6,46,821 క్యూసెక్కుల నీటి విడుదల ● కొనసాగుతున్న రెండో ప్రమాద హెచ్చరిక

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 6,61,960 క్యూసెక్కుల వరద నీరు సోమవారం ఇన్‌ఫ్లోగా నమోదయినట్లు ఇరిగేషన్ జేఈ రాజేశ్ తెలిపారు. బ్యారేజీ రిజర్వాయర్‌లో 16 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా దిగువకు 6,46,821 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టా కాలువకు 8,617 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 6,522 క్యూసెక్కులు వదలగా, గుంటూరు చానల్‌కు నీటి విడుదలను నిలిపేశారు. ప్రకాశం బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోందని దిగువ నది తీర ప్రాంత వాసులు, లంక భూముల రైతులు మత్స్యకారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.


దిగువకు విడుదలవుతున్న వరద నీరు

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

ముప్పవరం సర్వీస్‌రోడ్డులో ఘటన



మృతి చెందిన యువకుడు



108 వాహనంలో బాధితుడు

పంగులూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పవరం ప్రధానకూడలిలో ఫ్లైఓవర్ పక్కన సర్వీస్ రోడ్డులో జరిగిన రోడ్డుప్రమాదంలో ఓ వ్యక్తి సంఘటనా స్థలంలో మృతిచెందగా మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... ఒంగోలువైపు నుంచి చిలకలూరిపేటవైపు ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఇరువురు వ్యక్తులు హైవే పక్కన సర్వీస్‌రోడ్డులో అదుపు తప్పి పడిపోవడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని హైవే అంబులెన్స్‌లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇద్దరు చిలకలూరిపేటకు చెందినవారుగా భావిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్‌ఐ వినోద్‌బాబు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



గాయపడి రోడ్డుపై ఉన్న యువకుడు

పంగులూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని జాగర్లమూడివారిపాలెం వద్ద 16వ నెంబరు జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ సమీపంలో డివైడర్‌కు ఢీకొట్టి ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంపై వెళుతున్న తెలగతోటి రాఘవరావు డివైడర్ ఢీకొని రోడ్డుపై పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన రాఘవరావును హైవే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

## రోడ్డు మార్జిన్‌లోకి దూసుకుపోయిన కారు

విద్యుత్‌స్తంభాన్ని ఢీకొనడంతో ప్రమాదం



ధ్వంసమైన కారు

అద్దంకి, సెప్టెంబరు29 (ఆంధ్రజ్యోతి) : కారు అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని రోడ్డు మార్జిన్‌లోకి దూసుకుపోయింది. స్థానికుల కథనం మేరకు... ఒంగోలు వైపు నుంచి అద్దంకి వైపు వస్తున్న కారు సోమవారం ఉదయం అద్దంకి పట్టణంలోని భిక్షాలు కాలనీ వద్ద అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని మార్జిన్‌లోకి దూసుకుపోయింది. ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవటంతో ఊపిరిపీల్చుకున్నారు. కారు మాత్రం దెబ్బతింది.

## నిరుపేద విద్యార్థికి రూ.40వేల ఆర్థిక సాయం

పర్చూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని నూతలపాడు గ్రామానికి చెందిన పల్లపు బాలాజీ అనే ఇంజనీరింగ్ విద్యార్థికి సోమవారం రూ.40వేల ఆర్థిక సహాయం అందజేశారు. కొల్లా సాంబశివరావు సమకూర్చిన నగదును రోటరీ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ చేతుల మీదుగా విద్యార్థికి పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో కోమటి ఆంజనేయులు, నాగభైరు శ్రీనివాసరావు, మానుకొండ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

## మట్టి అక్రమ తరలింపును అడ్డుకోవాలి

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం రేగులచెలుక చెరువులో అక్రమం గా మట్టి తవ్వకాలను అడ్డుకోవాలని గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు సోమవారం తహసీల్దార్ షేక్ హుసేన్‌కు వినతిపత్రం అందజేశారు. అక్రమంగా తవ్వకాలు చేపట్టి మట్టిని అమ్ముకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# పంగులూరులో సూపర్‌లీగ్ ఖోఖో పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న రాష్ట్ర ఖోఖోఅసోసియేషన్ చైర్మన్ డాక్టర్ గరటయ్య



ఖోఖో ప్రారంభ పోటీలో గెలుపు కోసం తలపడుతున్న ఇరుజట్లు

పంగులూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి) : క్రీడలలో గ్రామీణ యువత ఉత్సాహంగా పాల్గొనాలని మాజీ శాసనసభ్యులు, రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ బి.సిహెచ్.గరటయ్య కోరారు. పంగులూరులోని ఎంఎస్‌ఆర్ అండ్ బీఎస్‌ఎం జూనియర్ కళాశాలలో ఎస్‌ఆర్‌ఆర్ ఖోఖో అకాడమీ నిర్వహిస్తున్న సూపర్‌లీగ్ ఖోఖో పోటీలను సోమవారం డాక్టర్ గరటయ్య ప్రారంభించారు. అకాడమీ నిర్వాహకులు కె.కె.ఎఫ్.ఐ ఉపాధ్యక్షుడు సీతారామిరెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రారంభసభలో గరటయ్య మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడలలో రాణించిన యువతకు విద్య, ఉద్యోగాలలో ప్రాధాన్యత కల్పించి ప్రోత్సహిస్తోందన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన విద్యార్థులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించారని, ఆరుసార్లు రాష్ట్ర, మూడుసార్లు జాతీయ స్థాయి ఖోఖో పోటీలను స్థానిక ప్రజల సహకారంతో పంగులూరులో విజయవంతంగా నిర్వహించామని గుర్తుచేశారు. ప్రోకబడ్డీ తరహాలో పంగులూరు కేంద్రంగా ప్రో ఖోఖో పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థిని, రాజస్థాన్ యువతి బీజియా నృత్య ప్రదర్శన, మహిళల కోలాట ప్రదర్శన అలరించాయి. కార్యక్రమంలో రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ బత్తుల వీరనారాయణ, రాయిణి రామారావు, ప్రిన్సిపాల్ ఉషారాణి, క్లబ్ ప్రతినిధులు షేక్ కాలేషావలి, వీరరాఘవయ్య, ఆర్.వి.సుబ్బారావు, అంతర్జాతీయ ఖోఖో క్రీడాకారుడు శివారెడ్డి, సౌజన్య, ప్రజాకళాకారుడు నందవరపుజాన్ పాల్గొన్నారు.

# సాదాసీదాగా అద్దంకి మున్సిపల్ అత్యవసర సమావేశం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ

అద్దంకి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి) : అద్దంకి మున్సిపల్ అత్యవసర సమావేశం సోమవారం సాదాసీదాగా సాగింది. చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన జరిగిన మున్సిపల్ సమావేశంలో మొత్తం 12 అంశాలను ఆమోదించారు. సమావేశం ప్రారంభమైన 15 నిమిషాల వ్యవధిలోనే పూర్తయ్యింది. అనంతరం వార్డుల విభజనపై కౌన్సిలర్లు తమకు ఉన్న అనుమానాలను నివృత్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా వార్డుల విభజన ఏ విధంగా చేస్తున్న విధానాన్ని కమిషనర్ రవీంద్ర వివరించారు. తన వార్డు పరిధిలో ఇంతవరకు ఈవిషయం తనకు తెలియదని 1వ వార్డు కౌన్సిలర్ బాలు చెప్పటంతో అందరూ ఒక్కసారిగా నవ్వారు. పదవీ కాలం కూడా పూర్తవుతుంటే ఇప్పటి వరకు వార్డు పరిధి తెలియదనటం ఏమిటని పలువురు వ్యాఖ్యానించారు. తమ వార్డులలో జరిగిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించాలని 1, 20వ వార్డుల కౌన్సిలర్లు బాలు, కోటేశ్వరరావు కోరారు. వైస్ చైర్మన్లు దేసు పద్మేష్, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

# వృద్ధాప్యంలో జీవన పోరాటం

**నా అనే వారు లేకున్నా**

**పొట్టచేతబట్టుకుని ప్లాస్టిక్ వస్తువుల అమ్మకం**

**అవగాహన లేక ప్రభుత్వ పథకాలకు దూరం**



రిక్షా తొక్కుతూ ప్లాస్టిక్ పూలు అమ్ముకుంటున్న వృద్ధురాలు పోలమ్మ

పర్చూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కండలు ఉడికిపోయాయి.. ఎముకలు వంగిపోయాయి.. సత్తువ సన్నగిల్లింది.. అయినా బతుకుదెరువు కోసం వృద్ధాప్యంలో జీవన పోరాటం చేస్తుంది ఆ వృద్ధ మహిళ. నోట్లోకి నాలుగువేళ్లలేని పరిస్థితి ఆవరించింది. ఈ దుర్భర స్థితిలో, తెలిసిన వారి వద్ద అతి కష్టం మీద అప్పుతీసుకొని రిక్షా బండిపై ప్లాస్టిక్ పూలు అమ్ముకుంటూ బతుకు బండి లాగుతోంది. పర్చూరు మండలం నాగులపాలెంలో నివాసం ఉంటున్న గాలేటి పోలమ్మకు ముప్పై ఏళ్ల క్రితం భర్త చనిపోయారు. ఆ తర్వాత ఉన్న ఒక్క కుమారుడు, ఇద్దరు కుమార్తెలు కూడా చనిపోయారు. ఆమె కుంగిపోయింది. ఆరు పదుల వయస్సు పైబడినా స్వశక్తితో జీవించేందుకు ఎండనక, వాననక రిక్షా బండిపై ప్లాస్టిక్ పూలు పెట్టుకొని రిక్షా తొక్కుకుంటూ ఈ చుట్టుపక్కల గ్రామాలన్నీ తిరుగుతూ పూలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తోంది.

**అర్హత ఉన్నా అందని సంక్షేమ పథకాలు...**

పోలమ్మకు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హత ఉన్నా వాటిని తీసుకునే పరిజ్ఞానం లేక అందుకోలేకపోతోంది. కనీసం ఆధార్ కార్డు కానీ, రేషన్ కార్డు కానీ లేకపోవటం బాధాకరం. దీంతో వృద్ధాప్య పింఛన్ సైతం అందుకోలేని దుస్థితి. అధికారులు స్పందించి వృద్ధురాలి దీన స్థితిని గమనించి నిబంధనలు సడలించి ఆధార్, రేషన్ కార్డును మంజూరు చేసి ప్రభుత్వ పింఛనన్ మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# సరస్వతీదేవి నమోస్తుతే



అద్దంకిలోని వేయిస్తంభాల గుడిలో సరస్వతీ దేవి అలంకరణలో అమ్మవారు

అద్దంకి, సెప్టెంబరు29 (ఆంధ్రజ్యోతి) : దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా సోమవారం అద్దంకి పట్టణంలోని వేయిస్తంభాల గుడి, కన్యకాపరమేశ్వరి దేవాలయం, దత్తపాదు కా క్షేత్రం, పోలేరమ్మ దేవాలయం లలో అమ్మవార్లను సరస్వతీ దేవిగా అలంకరించారు. శింగరకొండలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో సరస్వతీ పూజ నిర్వహించారు. పలువురు చిన్నారులకు అక్షరాభాస్యం చేశారు. అద్దంకిలోని కన్యకాపరమేశ్వరి దేవాలయంలో దసరా ఉత్సవాలు ప్రారంభించి 54 సంవత్సరాలు పూర్తయినందున సోమవారం 54 కిలోల లడ్డును ఊరేగింపుగా తీసుకువెళ్లి దేవాలయంలో ఉంచారు.

**పంగులూరులో...**

పంగులూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాలలో సోమవారం దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. రేణంగివరం గ్రామంలోని త్రిశక్తిపీఠం, ముప్పవరంలోని శ్రీషిర్డీసాయి ఆలయాలలో అమ్మవారిని సరస్వతిదేవిగా అలంకరించారు. అలాగే చందలూరులోని చిట్టాబత్తినవారి రేణుకమ్మ ఆలయంలో, గోవిందయ్య కళానిలయంలో అమ్మవారిని అలంకరించి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. రామకూరు, పంగులూరు పరిసర గ్రామాలలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్తంగా పూజలు చేశారు.

**మార్టూరులో...**

మార్టూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మార్టూరులోని దుర్గామల్లేశ్వరి దేవస్థానంలో మహాచండీ దేవి అవతారంలో, ద్రోణాదులలో వారాహి అవతారంలో అ మ్మ వారు భక్తులకు దర్శనమిచ్చారు. వలపర్లలో, మార్టూరులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో, పడమర బజారున రుక్మాబాయి సమేత పాండురంగ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో, నాగరాజుపల్లిలోని దేవాలయంలో అమ్మవారు పూజలందుకున్నారు.

**బల్లికురవలో...**

బల్లికురవ, సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో దసరా నవరాత్రి పూజా కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. నక్కబొక్కలపాడు గ్రామ పోలేరమ్మ దేవాలయంలో నవరాత్రుల వేడుకలలో భాగంగా సరస్వతి దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అలానే కొత్తపాలెం, కొత్త మల్లాయపాలెం, వేమవ రం, అంబడిపూ డి, కొమ్మి నే ని వారి పాలెం, కొప్పెరపాడు గ్రామాలతో పాటు పలు గృహాలలో సోమవారం సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు దేవాలయాలలో అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు.

**రామాలయం గర్భగుడిని తాకిన సూర్య కిరణాలు**

బల్లికురవ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపాలెం రామాలయంలో గర్భగుడిలో ఉన్న దేవతామూర్తుల విగ్రహాలను సోమవారం సూర్యకిరణాలు తాకాయి. దక్షిణాయనం మొదలు రోజూ రామయ్యను ఉదయం పూట సూర్యకిరణాలు తాకటం ఆనవాయితీ. మూల నక్షత్రం కావటంతో సోమవారం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి సూర్యకిరణాలను తిలకించారు. పూజారి అయినవోలు సుబ్బాచార్యులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

**చినగంజాంలో...**

చినగంజాం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి) : స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి మందిరంలోని బతుకమ్మ అమ్మవారిని మహిళా భక్తులు ప్రత్యేకంగా అలంకరించి, కుంకుమ పూజలు నిర్వహించారు. సోపిరాల గ్రామ రామకోటేశ్వర స్వామి ఆలయంలోని లలితా పరమేశ్వరి అమ్మవారిని, చినగంజాం గ్రామంలోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారిని, రైల్వేసెంటర్ భవానీపురంలోని విజయకనకదుర్గాభవాని అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. నీలాయపాలెం, కడవకుదురు, గొనసపూడి, పెదగంజాం, చింతగుంపల్లి, సంతరావూరు తదితర గ్రామాల్లో వివిధ రూపాల్లో అలంకరించిన అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయాలు రంగురంగుల విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

## కమీషన్‌కు లోనుకావాల్సిందే..!

(5వ పేజీ తరువాయి)

శాఖ పరిధిలో 74,640 స్వయం సహాయక బృందాలు (డ్వాక్రా గ్రూపులు) ఉన్నాయి. వాటిలో ఏడున్నర లక్షల మందికి పైగా మహిళలు సభ్యులుగా ఉన్నారు. గ్రూపు నిర్వహణ, సభ్యుల సమావేశం, కార్యకలాపాల్లో సహాయ సహకారాలు అందించేందుకు పట్టణ ప్రాంతాల్లో రిసోర్స్ పర్సన్లను మెప్మా నియమించగా, గ్రామీణ ప్రాంతాల్లో యానిమేటర్లను గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని సెర్ప్ నియమించింది. ఇలా గ్రూపు మహిళలకు సహాయ, సహకారాలు అందించడం కోసం ఏర్పాటు చేసిన వ్యవస్థ ఇప్పుడు రాబందుల వ్యవస్థగా మారిపోయింది. గ్రూపు మహిళలను పీడించుకుతింటున్నారు. డ్వాక్రా మహిళలు తమకు కమీషన్ చెల్లించడం అనేది హక్కుగా చెబుతూ వారిపై తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు తెస్తున్నారు. ఒక్కో పనికి రేటు కట్టి మామూళ్లు వసూళ్లు చేస్తున్నారు.

**● రుణం పొందాలంటే రూ. 10వేలు ఇవ్వాల్సిందే!**

డ్వాక్రా గ్రూపుల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రుణ సహాయం చేస్తుంది. ఏదో ఒక స్వయం ఉపాధి పొందుతూ.. మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేందుకు ఆ రుణాలు తోడ్పడుతాయి. రుణం తీరిన వెంటనే మరోమారు రుణాలు అందిస్తుంది. నిరంతరం జరిగే ఈ ప్రక్రియను యానిమేటర్లు, ఆర్పీలు ఆదాయ వనరుగా మార్చుకున్నారు. డ్వాక్రా సంఘాలకు ఇచ్చే రుణాలు బ్యాంకుల నుంచి సభ్యుల ఖాతాల్లో జమ కావాలంటే యానిమేటర్ లేదా ఆర్పీ తీర్మానం రాసి, సీసీ, ఏపీఎం సంతకాలు చేయించి అప్రూవల్ చేయించాలి. ఇదే వారికి వరంగా మారింది. దీనిని అడ్డం పెట్టుకుని ప్రతిసారి ఇలా రుణం పొందే సమయంలో ఒక్కో మహిళ నుంచి రూ.వెయ్యి, రూ.1,500 వరకూ, లేదంటే గ్రూపు మొత్తంగా రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకూ ఆర్పీలు, యానిమేటర్లు వసూలు చేస్తున్నారు. పొందుపు మహిళలు ఇవ్వడానికి ఇష్టపడకపోతే తీర్మానాలు రాయకుండా ఆపుతున్నారు. అధికారులకు ఫిర్యాదులు చేసినా వెరవని స్థితికి వారు చేరారు. మహిళలు ఫిర్యాదులు చేయకుండా బెదిరింపులకు దిగుతున్నారు. వీటితోపాటు అత్యవసర సమయంలో పొదుపు డబ్బులపై తీసుకునే రుణాలకు కూడా వీరి మామూళ్ల బాదుడు తప్పడం లేదు. గ్రూపునకు రూ.2వేల నుంచి రూ.4వేలు ఇవ్వకుండా పని మాత్రం జరగడం లేదు. వీటితోపాటు ప్రతి నెలా నిర్వహించే గ్రూపు సమావేశంలో సమావేశంలోని అంశాలు, తీర్మానాలు రాసినందుకు రూ.500 నుంచి వెయ్యి రూపాయలు వసూలు చేస్తున్నారు. దీంతో డ్వాక్రా మహిళలు లబోదిబో మంటున్నారు. అధికారులు దీనిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

## నేటితో గడువు.. పొడిగిస్తేనే.. ఆదరువు

(5వ పేజీ తరువాయి)

అనుమతివ్వాలనే అభ్యర్థనను రాష్ట్రస్థాయి అధికారులకు పంపినట్లు మార్క్‌ఫెడ్ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం తొలుత ఇచ్చిన గడువు మంగళవారంతో ముగుస్తుండగా, కేంద్రాల కొనసాగింపుపై ప్రభుత్వ నిర్ణయం ఏ విధంగా ఉంటుందోననే ఆందోళన బర్లీ రైతుల్లో ఉంది

**మూడు నెలల పాటు...**

జూన్ చివరి వారంలో మార్క్‌ఫెడ్ ద్వారా బర్లీ పొగాకు కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. బాపట్ల జిల్లాతో పాటు ప్రకాశం, పల్నాడు, గుంటూరు జిల్లాల్లోని బర్లీ పొగాకు రైతులకు మేలు జరిగేలా తొలుత 7 కేంద్రాలతో ప్రారంభించి మొత్తం 58 కేంద్రాలలో మార్క్‌ఫెడ్ కొనుగోళ్లు చేపట్టింది. గోదాములను గుర్తించిన చోటే కొనుగోళ్ల కేంద్రాలను తెరిచి రైతులు తమ నిల్వలను అక్కడకే తెచ్చేలా షెడ్యూలింగ్ ఇచ్చింది. మార్కెటింగ్, వేర్‌హౌసింగ్‌తో పాటు ఎఫ్‌సీఐ గోదాములను సైతం బర్లీ నిల్వలకోసం మార్క్‌ఫెడ్ ఉపయోగించింది. గోడౌన్‌ల కొరత కారణంగా కొనుగోళ్ల ప్రక్రియు ఎటువంటి విఘాతం కలగకూడదని ముందస్తుగానే చర్యలు తీసుకుని మూడు నెలల పాటు ఈ అంకాన్ని మార్క్‌ఫెడ్ ముందుకు తీసుకెళ్లగలిగింది. ప్రస్తుతం 6 కేంద్రాలలో కొనుగోళ్లు జరుగుతుండగా మంగళవారంతో ప్రక్రియ ముగుస్తుందా లేదా కొనసాగింపుకు ప్రభుత్వం అనుమతిస్తుందా అనేది తేలాల్సి ఉంది

**లక్షల క్వింటాళ్లలోనే మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసినా...**

ఇప్పటి వరకు నాలుగు జిల్లాల పరిధిలో 2,08,510 కింటాళ్ల బర్లీ పొగాకును మార్క్‌ఫెడ్ రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసింది. ఇందులో ఒక్క బాపట్ల జిల్లా వాటానే 1,40,298 క్వింటాళ్లుగా ఉండగా, గుంటూరు జిల్లాలో 32,064, పల్నాడులో 23,693, ప్రకాశం జిల్లాలో 12,455 క్వింటాళ్లను మార్క్‌ఫెడ్ సేకరించింది. మొత్తం 11,462 మంది రైతులకు లబ్ధి చేకూరింది. ఇప్పటికే దశల వారీగా రైతుల ఖాతాల్లో రూ.90కోట్లు జమ చేసిన మార్క్‌ఫెడ్ ఇంకా దాదాపు రూ.50 కోట్ల వరకు చెల్లించాల్సి ఉందని చెబుతోంది. ఇంత పెద్ద ఎత్తునా మార్క్‌ఫెడ్ కొనుగోళ్ళు జరిపినప్పటికీ ఇంకా అన్నదాతల వద్ద లక్ష క్వింటాళ్ల వరకు బర్లీ నిల్వలు ఉన్నట్లు తెలుస్తోంది

## సాగుకు సమస్యలు లేకుండా చర్యలు

అవీఇవీ

తోటవారిపాలెం పంపింగ్ స్కీంను ప్రారంభించిన ఎమ్మెల్యే



ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

బోయినవారిపాలెం(చీరాల), సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ఖరీఫ్‌లో సాగు చేసేందుకు రైతులకు సమస్యల్లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. సోమవారం మండల పరిధిలోని బోయినవారిపాలెంలో గల తోటవారిపాలెం ఎత్తిపోతల పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్లక్ష్యధోరణితో వ్యవహరించిన కారణంగా నియోజకవర్గంలోని ఐదు పంపింగ్ స్కీంలు మూతపడ్డాయన్నారు. వాటిపై దృష్టి సారించినట్లు చెప్పారు. అనంతరం రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు.

## జీఎస్టీ తగ్గింపుతో ప్రజల కొనుగోలు శక్తి పెంపు

ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటస్వామి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటస్వామి

పర్చూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ తగ్గింపుతో ప్రజల కొనుగోలు శక్తి పెరిగి ఆర్థిక పురోగతి చేకూరుతుందని ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటస్వామి చెప్పారు. ప్రభుత్వాలు తగ్గించిన జీఎస్టీపై సోమవారం మండల అధికారులు, సచివాలయం సిబ్బందితో కలసి అవగాహనా ర్యాలీ నిర్వహించారు. అనంతరం బొమ్మల సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు నెలకు సరాసరి రూ.1200 నుంచి రూ.1500 వరకు బారం తగ్గుతుందన్నారు. జిల్లా సీటీవో శ్రీనివాస్ మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు ఫలాలు ప్రజలకు చేరువ చేయాలన్న ఉద్దేశ్యంతో అవగాహనా కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ కొసనా సత్యనారాయణ, ఏపీవో రమేష్, పంచాయతీ కార్యదర్శి మస్తాన్‌రావు, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ షంషుద్దీన్, బీజేపీ నాయకులు అడపాల కృష్ణ, సామ్రాజ్యం, ఏవో శకుంతల పాల్గొన్నారు.

## సచివాలయ ఉద్యోగుల పనిభారం తగ్గించాలి



వినతిని పరిశీలిస్తున్న కమిషనర్ అబ్దుల్ రషీద్

చీరాల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సచివాలయ ఉద్యోగుల పనిభారాన్ని తగ్గించాలని, ఇంటింటికీ వెళ్లి అందించే సేవలపై పునఃపరిశీలన చేయాలని పలువురు ఉద్యోగులు కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం కమిషనర్ అబ్దుల్ రషీద్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ సేవలు, సర్వేలు, ఆధార్ సీడింగ్, వాహనమిత్ర డేటా, బీఎల్‌వో డ్యూటీలతో అవస్థలు పడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉద్యోగులు సతీష్, రాధిక, శ్రీను నాయక్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## శబరి ఎక్స్‌ప్రెస్.. ఇకపై సూపర్ ఫాస్ట్.!

నేటినుంచి మారనున్న రైలు నంబర్లు

హైదరాబాద్ నుంచి త్రివేండ్రంకు 2గంటల సమయం ఆదా

ప్రయాణికులపై సూపర్ ఫాస్ట్ చార్జీల భారం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్-త్రివేండ్రం మధ్య నడుస్తున్న శబరి ఎక్స్‌ప్రెస్ నేటి నుంచి సూపర్ ఫాస్ట్ రైలుగా మారనుంది. ప్రస్తుతం 17229/30 నంబర్లతో నడుస్తున్న శబరి ఎక్స్‌ప్రెస్ గురువారం నుంచి 20629/30 నంబర్లతో పరుగులు పెట్టనుంది. గతంతో పోల్చుకుంటే రైలు వేగం పెరగడంతో ఆ రైళ్లలో ప్రయాణించే వారికి సుమారు 2 గంటల ప్రయాణ సమయం ఆదా కానుంది. నిన్న, మొన్నటివరకు సికింద్రాబాద్ నుంచి రోజూ మధ్యాహ్నం 12.20గంటలకు బయల్దేరే శబరి ఎక్స్‌ప్రెస్ మరుసటి సాయంత్రం 6.05గంటలకు త్రివేండ్రంకు (29.45గంటల ప్రయాణం) చేరుకునేది. తాజాగా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌గా మారాక ప్రతిరోజూ మధ్యాహ్నం 2గంటలకు సికింద్రాబాద్ నుంచి బయల్దేరి మరుసటి రోజు సాయం త్రం 6.25గంటలకు (28గంటల్లో) చేరనుంది. అలాగే, ఇంతకుమునుపు త్రివేండ్రంలో ఉదయం 6.45గంటలకు బయల్దేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.45గంటలకు సికింద్రాబాద్‌కు (30గంటల్లో) వచ్చే శబరి ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్‌గా మారాక త్రివేండ్రంలో ఉదయం 6.45గంటలకు బయల్దేరి సికింద్రాబాద్‌కు ఉదయం 11గంటల కల్లా(27.45గంటల్లోగా) చేరనుంది.

**ప్రయాణికులపై 'సూపర్ ఫాస్ట్' బాదుడు.!**

శబరి ఎక్స్‌ప్రెస్ సూపర్ ఫాస్ట్ కావడంతో ప్రయాణ సమయం 2గంటలు ఆదా అవుతుందని ఒకవైపు ఆనందపడుతున్న ప్రయాణికులు, మరోవైపు సూపర్ ఫాస్ట్ చార్జీల రూపేణా జనరల్ సెకండ్ క్లాస్ టికెట్‌కు అదనంగా రూ.15, స్లీపర్ ఏసీ తరగతుల టికెట్లపై రూ.30నుంచి 40వరకు అదనంగా చెల్లించాల్సి రావడం పట్ల విచారం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఇప్పటివరకు దక్షిణమధ్యరైల్వే ఆధ్వర్యంలో ఉండే శబరి ఎక్స్‌ప్రెస్ నిర్వహణ (మెయింటెనెన్స్) బాధ్యతలను నేటినుంచి సదరన్ రైల్వే చేపట్టనుందని రైల్వే ఉన్నతాధికారులు వెల్లడించారు.

## రేషన్ సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలి



రేషన్‌షాపును పరిశీలిస్తున్న డీఎస్‌వో పద్మశ్రీ

పామూరు, సెప్టెంబరు 29 (ఆంధ్ర జ్యోతి): రేషన్ షాపుల ద్వారా కార్డుదారులకు సక్రమంగా సరుకులు పంపిణీ చేయాలని డీఎస్‌వో పద్మశ్రీ అన్నారు. పట్టణంలోని పలు రేషన్ దుకాణాలతో పాటు గోపాలపురంలోని రేషన్ దు కాణాన్ని సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా స్టాకు రికా ర్డులను పరిశీలించి తగు సూచనలు చేశారు. రేషన్ దుకాణదారులు సమ యపాలనను ఖచ్చితంగా పాటించాలన్నారు. ఆమెవెంట కనిగిరి ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటి భూపతి ఉన్నారు.

## తప్పిపోయిన చిన్నారి...

### గుర్తించి కుటుంబానికి అప్పగించిన శక్తిటీం




చిన్నారిని తల్లికి అప్పగిస్తున్న సీఐ సుబ్బారావు

చీరాల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : చీరాల పట్టణంలో సోమవారం ఓ చిన్నారి తప్పిపోయింది. పోలీసులు గంటల వ్యవధిలోనే చిన్నారి తల్లిదండ్రులను గుర్తించి బిడ్డను అప్పగించారు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పంగులూరుకు చెందిన దంపతులు వారి నాలుగేళ్ల పాపతో సహా బంధువులతో కలిసి పెళ్లి దుస్తులు కొనేందుకు చీరాల వచ్చారు. ఎం జీసీ మార్కెట్‌లోని షాప్‌లో అందరూ దుస్తులు చూసుకుంటుండగా చిన్నారి బయటకొచ్చింది. దుకాణాల సమీపం లో సంచరిస్తుండగా శక్తి టీం కంటపడింది. వారు పాపను స్టేషన్‌కు తరలించి ఆరా తీశారు. తల్లిదండ్రుల ఆచూకీ లేకపోవడంతో శక్తి టీం తల్లిదండ్రులను వెదికే పనిలో పడ్డారు. ఈలోపు బిడ్డ ఆచూకీ తెలియక తల్లిదండ్రులు రోదిస్తున్నారు. వారిని గుర్తించిన శక్తి టీం సెల్‌ఫోన్‌లో పాప ఫొటో చూపించగా మా బిడ్డే అని చెప్పడంతో సీఐ సుబ్బారావు వద్దకెళ్లారు. ఆయన బిడ్డను అప్పగించి సూచనలు చేశారు.

## వైసీపీతోనే రాష్ట్రాభివృద్ధి

### డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించిన ఆ పార్టీ నేతలు

రామకృష్ణాపురం(చీరాల), సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాభివృద్ధి వైసీపీతోనే సాధ్యమని, రాష్ట్రంలో రెడ్‌బుక్ పేరుతో సామాన్య వైసీపీ కార్యకర్తలను ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తోందని పలువురు వైసీపీ నేతలు ఆరోపించారు. నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ ఆదేశాల మేరకు క్యాంపు కార్యాలయంలో వైసీపీ డిజిటల్ బుక్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నేతలు యాతం మేరిబాబు, వాసుమళ్ల వాసు, గవిని శ్రీను, గోసాల అశోక్, రాఘవరావు, రమణారెడ్డి, రాజ కుమార్, మహేష్ పాల్గొన్నారు.

## కడవకుదురులో సామాజిక తనిఖీ గ్రామసభ



మాట్లాడుతున్న డీఆర్‌పీ లీలాకృష్ణ

చినగంజాం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉపాధిహామీ పథకం పనులపై సోమవారం సామాజిక తనిఖీ గ్రామ సభ నిర్వహించారు. 2024-25లో గ్రామంలో జరిగిన పనులు, వాటిపై జరిగిన అవకతవకలను గ్రామసభలో ఎస్‌ఆర్‌పీ నాగరాజు, డీఆర్‌పీ లీలాకృష్ణలు వివరించారు. ఉపాధిహామీ పథకం ద్వారా జరిగిన గృహనిర్మాణ పనులు, తోటల పెంపకం, వరదకట్టలలో అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. ఎంపీడీవో కె.ధనలక్ష్మి, ఏవో ఆర్.చంద్రశేఖర్, గ్రామ కార్యదర్శి పర్చూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# రాజకీయాలకతీతంగా చీరాల అభివృద్ధి

### ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. కౌన్సిల్ సాధారణ సమావేశంలో ఎమ్మెల్యే కొండయ్య

### కొన్ని పనులు ఈసారైనా చేయాలని వైసీపీ నేతల వినతులు



కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే కొండయ్య, చైర్మన్, కౌన్సిలర్లు, అధికారులు

చీరాల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పార్టీలకు అతీతంగా ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం అభివృద్ధి పనులకు ప్రణాళిక రచిస్తున్నట్లు ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. సోమవారం పురపాలక సంఘం సమావేశం హాలులో చైర్మన్ సాంబశివరావు అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ క్రమంలో అజెండాలో 35 అంశాలు ప్రవేశపెట్టగా 33వ అంశంలోని 1 నుంచి 3 వరకు అలాగే 6వ అంశాన్ని రద్దు చేశారు. మిగిలినవన్నీ ఆల్ పాస్‌గా ముగించారు. జీరో హవర్స్‌లో వైసీపీ కౌన్సిలర్లు బొనిగల జైసన్‌బాబు, బత్తుల అనీల్, చీమకుర్తి బాలకృష్ణలు తమ వార్డుల్లోని కొన్ని సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. 'మా వైసీపీ ప్రభుత్వంలో వాటిని పరిష్కరించేందుకు అంతరాయం కలిగిందని, ఈ ప్రభుత్వంలోనైనా పరిష్కరించాలని కోరారు. దీంతో చైర్మన్ సాంబశివరావు, వైసీపీ కౌన్సిలర్ల మధ్య వాదనలు నడిచాయి. అవి కాస్త జటిలమయ్యే సమయంలో ఎమ్మెల్యే రెండు వర్గాలను సమన్వయం చేశారు. గతంలో మీరు అధికారంలో ఉండగా చేయలేకపోవడం వైఫల్యంగా చెప్పుకొచ్చారు. అయినా ఎటువంటి సమస్య లేదని, ఇది ప్రజా ప్రభుత్వమని, కచ్చితంగా అభివృద్ధి చేస్తానని చెప్పారు. సమస్యలున్న వార్డుల్లో నేరుగా పర్యటిద్దాం, మీరు కలిసి రండి.. భేదాలు లేకుండా అభివృద్ధి పనులు చేద్దామని చెప్పారు. సమావేశంలో కమిషనర్ అబ్దుల్ రషీద్, డీఈ రఘురామ్, ఏఈ రవికుమార్ పాల్గొన్నారు.

# రైతులకు అన్నివిధాలా సహకారం అందిస్తాం



సొసైటీ చైర్మన్ సాంబశివరావును అభినందిస్తున్న నాయకులు

మార్టూరు,సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రైతులకు సొసైటీల ద్వారా ఎరువులను సక్రమంగా ఇవ్వడంతో పాటు, వారికి అన్ని రకాలుగా సహకారం అందిస్తామని బొబ్బేపల్లి సొసైటీ చైర్మన్ జరుగుల సాంబశివరావు చెప్పారు. సోమవారం ఆయన మార్టూరులోని బొబ్బేపల్లి సొసైటీ కార్యాలయంలో చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేశారు. అదేవిధంగా డైరెక్టర్లుగా ముప్పా సాంబశివరావు, ముప్పవరపు వెంకటరామారావులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఏలూరి సహకారంతో రెండోసారి సొసైటీ చైర్మన్‌గా రైతులకు సేవ చేసే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. రైతులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలను అందిస్తూ, ఆర్థికంగా అభివృద్ధి చెందేవిధంగా కృషి చేస్తామని చెప్పారు. అనంతరం చైర్మన్ సాంబశివరావును ఎన్ఎస్‌పీ డిస్ట్రిబ్యూటరీ వైస్ చైర్మన్ ఉప్పలపాటి చక్రపాణి, సీఈవో కమ్మ మస్తాన్‌రావు, టీడీపీ మండల అధ్యక్షులు తాటి నాగేశ్వరరావు, కమ్మ శివనాగేశ్వరరావు, పోపూరి శ్రీనివాసరావు, శానంపూడి చైతన్య, శానంపూడి చిరంజీవి, పీడీసీసీ బ్యాంక్ మేనేజరు అన్నపూర్ణ, సూపర్ వైజర్లు ఎస్‌కే మస్తాని, ఏల్చూరి శ్రీనివాసరావులు అభినందించారు.

# నూజెళ్లపల్లిలో దసరా ఉత్సవాల నిర్వహణకు అనుమతి

### దేవదాయశాఖ అధికారుల నిర్ణయం

### స్వస్తివాచకం, గ్రామోత్సవంపై ఆర్డీవో, డీఎస్పీ సూచనలు



సమీక్ష చేస్తున్న ఆర్డీవో చంద్రశేఖరనాయుడు, డీఎస్పీ మహమ్మద్‌మొయిన్

పంగులూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజల మనోభావాలకు అనుగుణంగా నూజెళ్లపల్లి గ్రామంలో దసరా పర్వదిన సందర్భంగా దేవతలకు స్వస్తివాచకం, గ్రామోత్సవం నిర్వహించేందుకు అందరూ సహకరించాలని చీరాల ఆర్డీవో చంద్రశేఖర నాయుడు, డీఎస్పీ మొయిద్దీన్ చెప్పారు. నూజెళ్లపల్లిలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ అర్చకులైన చందలూరు వంశస్థులు, చల్లా వంశస్థుల మధ్య స్వస్తివాచకం నిర్వహణపై కొన్నేళ్లుగా వివాదం నెలకొనగా గ్రామంలో దసరా వేడుకలు నిలిచిపోయాయి. ఈ ఏడాది తమ గ్రామంలో పారువేట, గ్రామోత్సవం జరిపించాలన్న ప్రజల ఆకాంక్షల మేరకు రెవెన్యూ, పోలీస్, దేవదాయ శాఖ అధికారులు ఆలయ అర్చకస్వాములు, చల్లావంశస్థులు కార్యక్రమం నిర్వహణపై పంగులూరు రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్వస్తివాచకం ఎవరు నిర్వహించాలి అనే విషయమై ఇరువురి వాదనలు విన్న అధికారులు దేవదాయశాఖ అధికారుల నిర్ణయం మేరకు ఉత్సవం నిర్వహణ చేపట్టాలని, అందుకు అందరూ సహకరించాలని సూచించారు. ఉత్సవం నిర్వహణలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సింగారావు, సీఐ మల్లికార్జునరావు, ఈవో శ్రీనివాసరావు, ఎస్ఐ వినోద్‌బాబు పాల్గొన్నారు

# అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుపై కమిటీ ఏర్పాటు

### అధికారుల సమావేశంలో నిర్ణయం



మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజనేయులు,ఆర్‌డీవో గ్లోరియా,సీఐ శేషగిరిరావు

మార్టూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి) : మండలంలోని డేగరమూడి గ్రామంలోని టీడీపీ, వైసీపీ నాయకులు, పలు దళిత సంఘాల నాయకులతో సోమవారం సాయంత్రం మార్టూరులోని ఎంపీడీవో కార్యాలయంలో డీఎస్పీ రామాంజనేయులు, ఆర్‌డీవో గ్లోరియా ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. రెండురోజులుగా డేగరమూడి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుపై జరుగుతున్న వివాదాల నేపథ్యంలో డీఎస్పీ, ఆర్‌డీవోలు ఉన్నత అధికారుల ఆదేశాలు మేరకు వారితో సమావేశం నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు సంబంధించి వారందరి అభిప్రాయాలను అధికారులు తెలుసుకున్నారు. అనంతరం డీఎస్పీ, ఆర్‌డీవోలు వారితో మాట్లాడుతూ రెండు మూడు రోజులలో గ్రామంలోని అందరూ కలిసి అంబేడ్కర్ విగ్రహ కమిటీ ఏర్పాటు చేయాల్సిందిగా సూచించారు. ఇదిలా ఉండగా గ్రామ పంచాయతీ కార్యదర్శితో పాటు సీఐలపై విచారణ జరుగుతోందని, దాని వివరాలను ఉన్నత అధికారులకు పంపిస్తామన్నారు. సీఐ శేషగిరిరావు, తహసీల్దారు ప్రశాంతి, దళిత సంఘాల నాయకులు నీలం నాగేంద్రం, దారా అంజయ్య, డాక్టరు చారువాక, నాయకులు జాగర్లమూడి శ్రీనివాసరావు, వైసీపీ నాయకులు జంపని వీరయ్యచౌదరి పాల్గొన్నారు.

## రాళ్లపల్లిలో శ్మశాన స్థలం కేటాయించాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎంఆర్‌పీఎస్ నేతలు, రాళ్ళపల్లి ఎస్సీ కాలనీ వాసులు

అద్దంకి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాళ్లపల్లి ఎస్సీ కాలనీకి శ్మశానస్థలం కేటాయించాలని పలువురు ఎస్సీ కాలనీవాసులు, ఎంఆర్‌పీయస్ నేతలు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కుంకుపాడు పంచాయతీ పరిధిలో ఉన్న రాళ్ళపల్లిలో ఎస్సీ కాలనీవాసులకు చెందిన శ్మశానం విజయవాడ-బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంతో పూర్తి గా కోల్పోయింది. రెండేళ్ల నుంచి శ్మశానం కోసం ఎస్సీ కాలనీవాసులు అధికారులను కలుస్తున్నా ఇంతవరకు కేటాయించలేదని ఎంఆర్‌పీఎస్ నియోజకవర్గ ఇంచార్జి పూనూరి రమేష్ చెప్పారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నేతలు నెహేమియా, పాలెపోగు సుబ్బరావు పాల్గొన్నారు.

## అద్దంకి మున్సిపాలిటీ 27 వార్డులుగా విభజన



వార్డుల పునర్విభజన వివరాలను నోటీస్ బోర్డులో ఏర్పాటు చేస్తున్న మున్సిపల్ కమిషనర్

### 6వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరణ

అద్దంకి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి) : అద్దంకి మున్సిపాలిటీని 27 వార్డులుగా విభజిస్తూ ఆయా వార్డుల పరిధిలోని ప్రాంతాలను నోటీస్ బోర్డులో ఉంచారు. ప్రస్తుతం 20 వార్డులు ఉండగా 27కు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో వార్డుల పరిధి మార్పు చేస్తూ సోమవారం ప్రకటించారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, టౌన్‌ప్లానింగ్ అధికారి లక్ష్మీలు వివరాలను నోటీస్ బోర్డులో ఉంచారు. వార్డుల విభజనపై అక్టోబరు 6వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు మున్సిపల్ కార్యాలయంలో లిఖితపూర్వకంగా అభ్యంతరాలను అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



అవీఇవీ

## యూరియా బస్తాల పంపిణీ




రైతులకు యూరియా బస్తాలను పంపిణీ చేస్తున్న సొసైటీ సభ్యులు

మార్టూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగరాజుపల్లిలో సోమవారం సొసైటీ ఆధ్వర్యంలో రైతులకు యూరియా బస్తాలను పంపిణీ చేశారు.ఈసందర్భంగా సొసైటీ అధ్యక్షుడు దామర్ల బ్రహ్మయ్య మాట్లాడుతూ వ్యవసాయశాఖ ద్వారా సొసైటీకి 220 బస్తాలు యూరియా వచ్చాయన్నారు. బస్తా 267 రూపాయలకు అమ్ముతున్నట్లు తెలిపారు. రైతులందరికీ సకాలంలో ఎరువులను పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మురళీ కృష్ణారావు, టీడీపీ నాయకులు మిన్నెకంటి పోతురాజు పాల్గొన్నారు.

## బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషిచేయండి

### చీరాలలో ప్రజా ఆత్మీయ సమ్మేళనంలో పోతుల సునీత



సునీత దంపతులను జీడిపప్పు దండతో సత్కరిస్తున్న నేతలు

చీరాల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఎంఎల్‌సీ పోతుల సునీత చెప్పారు. ఇటీవల వైసీపీని వీడి బీజేపీ తీర్థం పుచ్చుకున్న దంపతులు సోమవారం పట్టణంలోని బావనమ్మ కల్యాణ మండపంలో ప్రజా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ భారం తగ్గించి సామాన్యులకు, వ్యాపారులకు అండగా ఉందని చెప్పారు. అనేక సంక్షేమ పథకాలు ద్వారా ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిందని చెప్పారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సీ దంపతులను జీడిపప్పు దండతో నేతలు సత్కరించారు. కార్యక్రమంలో బంగారుబాబు, మువ్వల వెంకట రమణరావు, బండారుపల్లి హేమంత్‌కుమార్, పోతుల సమర్‌కుమార్, భరణి, భవానీ, కుమార్, చంద్ర, తాడివలస దేవరాజ్, మణికంఠ, ప్రత్తి సుబ్బారావు, బాంబే సురేష్ తదితరులు పాల్గొన్నారు.


## అసభ్యకర పోస్టింగులు పెట్టవద్దు




రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ మొయిన్

మేదరమెట్ల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సమాజంలోని పెద్దలు, రాజకీయ నాయకులు, ప్రముఖులపై అసభ్యకర పోస్టింగులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ మొయిన్ హెచ్చరించారు. వార్షిక తనిఖీలలో భాగంగా సోమవారం మేదరమెట్ల పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సైబర్ పెట్రోల్ యాప్‌తో సోషల్ మీడియాలో వచ్చే అన్ని రకాల కంటెంట్‌లపై పరిశీలన చేస్తున్నట్లు చెప్పారు. అసభ్యకరమైన పోస్టులను వెంటనే తొలగించి పెట్టిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. దసరా పండుగకు ఇళ్లకు తాళాలువేసి ఊరుకు వెళ్లేవారు పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందిస్తే సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తారన్నారు. జాతీయ రహదారిలో వాహనాలను ఎక్కడపడితే అక్కడ ఆపి ప్రమాదాలకు కారణం కావద్దని చెప్పారు. ఈ కార్యక్రమంలో అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, మేదరమెట్ల ఎస్ఐ మహమ్మద్ రఫీ, కొరిశపాడు ఎస్ఐ సురేష్ పాల్గొన్నారు.

## దైవాలరావూరు సొసైటీ అభివృద్ధికి సహకరిస్తా



చైర్మన్ సీతారామయ్యను సన్మానిస్తున్న అధ్యక్షుడు మద్దినేని రాఘవస్వామి, బాలినేని వీరయ్య

మేదరమెట్ల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : దైవాలరావూరు సొసైటీ అభివృద్ధికి సహకరిస్తానని పీడీసీసీ బ్యాంకు చైర్మన్ కామేపల్లి సీతారామయ్య చెప్పారు. సోమవారం దైవాలరావూరు సొసైటీలో జరిగిన మహాజన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవాలరావూరు సొసైటీ గురించి పూర్తిగా తెలుసుకున్నానని, ఇక్కడ సభ్యులకు రుణాలు ఇవ్వడం, వసూలు చేయడం ఎరువుల వ్యాపారం బాగానే జరుగుతోందని చెప్పారు. పీడీసీసీ బ్యాంకు కౌంటర్ ఏర్పాటు చేయాలని సొసైటి చైర్మన్ మద్దినేని రాఘవస్వామి, సభ్యులు బాలినేని వీరయ్య, తొట్టెంపూడి హరిబాబులు సీతారామయ్యను కోరారు. తప్పకుండా బ్యాంకు కౌంటర్ ఏర్పాటు చేస్తానని సీతారామయ్య హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటి మాజీ చైర్మన్‌లు ముమ్మన నరసింహారావు, బాచిన బాలకోటయ్య, వ్యవసాయ అధికారి రామ్మోహనరెడ్డి, మద్దినేని శ్రీనివాసరావు, మద్దినేని గోపి, గుర్రం లక్ష్మీనారాయణ, సొసైటి కార్యదర్శి సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన




ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు

మార్టూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి) : స్వస్త్ నారీ సశక్త్ పరివార్‌లో భాగంగా సోమవారం మార్టూరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటరులో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆస్పత్రిలో ఉన్న వైద్యులతో పాటు ఇతర చోట్ల నుంచి వచ్చిన ప్రముఖ వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టరు అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో మానసిక వైద్యనిపుణులు సందీప్, చర్మవ్యాధుల వైద్యనిపుణులు హరిబాబు, చెవి ముక్కు వైద్య నిపుణులు స్రవంతి, దంతవైద్య నిపుణులు భానుచంద్రనాయుడు, డాక్టరు గార్గేయి, డాక్టరు భానుప్రసాద్‌లు దాదాపు 200 మందికి పైగా రోగులను పరీక్షించారు. ఇదిలా ఉండగా వారందరికీ రోటరీ క్లబ్ వారు ఉచితంగా భోజన ఏర్పాట్లు చేశారు.